




# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 343 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 17 ఆగస్టు 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :343 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 17 AUGUST 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur




## సూపర్ సిక్స్... సూపర్ ఫ్లాప్

- సీఎం చంద్రబాబు ప్రజలను ఘోరంగా మోసం చేశారని షర్మిల ఆరోపణ
- ఏడాది పాలనలో హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ధ్వజం
- ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మహిళలకు సాయం హామీలు గాలికి
- తల్లికి వందనం, రైతు పథకాలకు కోతలు పెట్టారని ఆరోపణ
- 14 నెలల తర్వాత బస్సు ఫ్రీ ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు

**పెన్ పవర్ డెస్క్:**ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల ముందు ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన 'సూపర్ సిక్స్' పథకాలు 'సూపర్ ఫ్లాప్' అయ్యాయని, ఇది ప్రజలను ఘరానా మోసం చేయడమేనని ఆమె ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. "సూపర్ సిక్స్ సూపర్ హిట్ ఎలా అయ్యింది సీఎం చంద్రబాబు గారూ? 20 లక్షల ఉద్యోగాలు అన్నారు... ఒక్కరికైనా ఇచ్చారా? నెలకు రూ.3 వేల భృతి ఏ ఒక్క నిరుద్యోగికైనా అందిందా? 18 ఏళ్లు నిండిన ఒక్క మహిళకైనా నెలకు రూ.15 వందలు అకౌంట్ లో పడ్డాయా? అన్నదాత సుఖీభవ కింద సొంతగా రూ.20 వేలు ఇస్తామని మాట మార్చారు. కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో లింక్ పెట్టారు. 30 లక్షల మంది రైతులకు పథకం దక్కకుండా పంగనామాలు పెట్టారు. తల్లికి వందనం కింద 20 లక్షల మంది

వివరాలు 2లో..

# వరద పోటుకు దెబ్బతిన్న పోలవరం ప్రాజెక్ట్ ఎగువ కాఫర్ డ్యాం

**గత పది రోజులుగా ఎగువన కురుస్తున్న భారీ వర్షాలు**

**పోలవరం ప్రాజెక్టుకు పోటెత్తిన గోదావరి వరద**

**వరద తాకిడికి దెబ్బతిన్న ఎగువ కాఫర్ డ్యాం**

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును వరదలు మరోసారి దెబ్బతీశాయి. గత పది రోజులుగా ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరికి వరద నీరు పోటెత్తడంతో ప్రాజెక్టులోని ఎగువ కాఫర్ డ్యాం పాక్షికంగా దెబ్బతిన్నట్టు తెలుస్తోంది. వరద ఉద్ధృతికి కాఫర్ డ్యాంలో కొంత భాగం కోతకు గురైనట్లు సమాచారం.వివరాల్లోకి వెళితే, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గోదావరి నదికి భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. ఈ తీవ్రమైన ప్రవాహం కారణంగా ఎగువ కాఫర్ డ్యాంకు సుమారు 10 అడుగుల వెడల్పు, 8 అడుగుల లోతులో డ్యామేజ్ జరిగినట్టు తెలుస్తోంది.



కాగా, పోలవరం ఎగువ కాఫర్ డ్యాం దెబ్బతినడం ఇది మొదటిసారి కాదు. గతంలో 2022 ఆగస్టు నెలలో వచ్చిన భారీ వరదలకు కూడా ఇదే తరహాలో డ్యాంకు నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. ఇప్పుడు మళ్లీ అదే సమస్య పునరావృతం కావడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. వరద ప్రవాహం కొనసాగుతుండటంతో అధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. దెబ్బతిన్న ప్రాంతంలో రిపేర్లు చేపట్టినట్టు అధికారులు తెలిపారు.

## అధర్మం ఎంత బలంగా ఉన్నా అది తాత్కాలికమే

- ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపిన జగన్
- ధర్మం నెమ్మదిగా ముందుకెళ్లినా అది శాశ్వతమని వ్యాఖ్య
- శ్రీకృష్ణుని జీవితం దీనికి నిదర్శనమని ట్వీట్



**పెన్ పవర్ డెస్క్:** శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా వైసీపీ అధినేత జగన్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆసక్తికర ట్వీట్ చేశారు. అధర్మం ఎంత బలంగా ఉన్నా అది తాత్కాలికమని ఆయన పేర్కొన్నారు. ధర్మం ఎంత నెమ్మదిగా ముందుకెళ్లినా అది శాశ్వతం అని చెప్పారు. శ్రీకృష్ణుని జీవితం దీనికి నిదర్శనమని అన్నారు. ఈ కృష్ణాష్టమి మీకు శాంతిని, ప్రేమను, విజయాన్ని తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.

వివరాలు 2లో..

## 'స్త్రీ శక్తి' పథకంపై నారా లోకేశ్ ఆసక్తికర ట్వీట్

- 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'స్త్రీ శక్తి' పథకం ప్రారంభం
- సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత బస్సు పథకాన్ని అమలు చేసిన కూటమి ప్రభుత్వం
- ఇది మహిళల స్వేచ్ఛకు, గౌరవానికి ప్రతీక అన్న నారా లోకేశ్

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలోని మహిళలకు కానుకగా కూటమి ప్రభుత్వం 'స్త్రీ శక్తి' పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. తాజాగా రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ...

వివరాలు 2లో..



## కుక్కల ప్రేమికులు పేదలను దత్తత తీసుకుని వీధులను కుక్కలకు వదిలేయాలి

- వీధి కుక్కలపై సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు
- దేశ వ్యాప్తంగా చర్చ
- కుక్కల ప్రేమికులను మరోసారి టార్గెట్ చేసిన వర్మ

**పెన్ పవర్ డెస్క్:**వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యల అనంతరం దేశవ్యాప్తంగా వీధికుక్కల దాడుల ఘటనలపై తీవ్ర చర్చ జరుగుతున్న నేపథ్యంలో, ఈసారి ఆయన కుక్కల ప్రేమికులను లక్ష్యంగా చేసుకుని తీవ్రమైన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. సోషల్ మీడియా వేదికగా ఆయన సంధించిన ప్రశ్నలు ప్రస్తుతం పెను దుమారం రేపుతున్నాయి."కుక్కలు మీకు

వివరాలు 2లో..



## ఏపీలో మరో అల్పపీడనం...

**రెండు అల్పపీడనాలతో విస్తారంగా వర్షాలు**

- వాయవ్య బంగాళాఖాతంలో సోమవారం మరో అల్పపీడనం
- రానున్న మూడు రోజులు కోస్తాంధ్రకు భారీ వర్షాలు
- రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు జల్లుల అంచనా
- మంగళవారం వరకు మత్స్యకారులకు వేటపై నిషేధం
- ఆదివారం పలు కోస్తా జిల్లాల్లో కుండపోత వర్షాలకు అవకాశం



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారత వాతావరణ శాఖ కీలక వర్ష సూచన జారీ చేసింది. వాయవ్య బంగాళాఖాతంలో ఆగస్టు 18, సోమవారం నాటికి మరో కొత్త అల్పపీడనం ఏర్పడే అవకాశం

వివరాలు 2లో..

## బీహార్ లో 'ఓట్ అధికార్ యాత్ర' చేపట్టిన రాహుల్ గాంధీ



- బీహార్‌లో రాహుల్ గాంధీ 'ఓట్ అధికార్ యాత్ర' ప్రారంభం
- ఓటర్ల జాబితాలో అక్రమాలపై కాంగ్రెస్ తీవ్ర నిరసన
- 16 రోజుల పాటు రాష్ట్రంలోని 23 జిల్లాల్లో యాత్ర
- యాత్రకు మద్దతు ప్రకటించిన మహాగఠ్‌బంధన్ మిత్రపక్షాలు
- ఓట్ల తొలగింపును 'ఓట్‌బందీ'గా అభివర్ణించిన విపక్షాలు
- రాహుల్ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన ఎన్నికల సంఘం

**పెన్ పవర్ డెస్క్:**బీహార్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఓటర్ల జాబితా నుంచి పేర్లను అక్రమంగా తొలగిస్తున్నారని ఆరోపిస్తూ, దీనిని 'ఓట్‌బందీ'గా అభివర్ణిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆందోళన

వివరాలు 2లో..

## బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించే అధికారం కోర్టుకు ఉండదు

**సుప్రీంకోర్టుకు కేంద్రం స్పష్టీకరణ**

- బిల్లుల ఆమోదంపై రాష్ట్రపతి, గవర్నర్లకు కోర్టులు గడువు విధించలేవని కేంద్రం స్పష్టీకరణ
- ఈ విషయంలో కోర్టులు జోక్యం చేసుకుంటే రాజ్యాంగ గందరగోళం తప్పదన్న కేంద్రం
- గడువు పెట్టడం వల్ల అత్యున్నత పదవుల గౌరవం తగ్గుతుందని ఆందోళన

**పెన్ పవర్ డెస్క్:**శాసనసభలు ఆమోదించిన బిల్లులకు రాష్ట్రపతి, గవర్నర్లు ఆమోదముద్ర వేయ డానికి కాలపరిమితి విధించే అధికారం న్యాయస్థానాలకు లేదని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. ఈ విషయంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకుంటే, అది రాజ్యాంగపరమైన

వివరాలు 2లో..



## భారత గగనతలానికి 'సుదర్శన చక్రం'... ఇక శత్రువుల ఆటలు సాగవు!

- ప్రధాని మోదీ ప్రకటించిన 'మిషన్ సుదర్శన్ చక్ర'
- దేశానికి బహుళస్థాయి గగనతల రక్షణ కవచం
- 2035 నాటికి దేశంలోని అన్ని కీలక ప్రాంతాలకు భద్రత
- రక్షణతో పాటు శత్రువుపై ప్రతిదాడి చేయగల సామర్థ్యం
- స్వదేశీ క్షిపణులతో వ్యవస్థను బలోపేతం చేయనున్న డీఆర్‌డీఓ
- ఇటీవల పాక్ విమానాలను కూల్చేసిన S-400 వ్యవస్థ


**పెన్ పవర్ డెస్క్:**భారత రక్షణ వ్యవస్థలో సరి కొత్త అధ్యాయానికి తెరలే చింది. దేశ గగనతలాన్ని శత్రు దుర్భేద్యంగా మార్చేం దుకు ఉద్దేశించిన ప్రతిష్ఠాత్మ క 'మిషన్ సుదర్శన చక్ర'ను ప్రధానమంత్రి

వివరాలు 2లో..



## ట్రంప్ హయాంలో రష్యాతో వాణిజ్యం 20 శాతం పెరిగిందన్న పుతిన్

- అమెరికాతో వాణిజ్యం... రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆసక్తికర వ్యాఖ్యలు
- రష్యా చమురు కొనుగోలుపై భారత్‌కు ట్రంప్ ఊరట
- సుంకాల విధింపుపై వెనక్కి తగ్గే అవకాశం ఉందని సూచన



**పెన్ పవర్ డెస్క్:**అమెరికా, రష్యా సంబంధాలపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. అలస్కాలో జరిగిన శిఖరాగ్ర సమావేశం సందర్భంగా పుతిన్

వివరాలు 2లో..

## ఉలిక్కిపడిన ధర్మవరం.. ఉగ్రసంస్థలతో లింకులపై నోరు విప్పని నూర్ మహమ్మద్



**పెన్ పవర్ డెస్క్:** పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థలతో ఫోన్‌లో చాటింగ్ చేస్తున్న శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం యువకుడు నూర్ మహ్మద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్ఐఏ, కౌంటర్ ఇంటెలిజెన్స్ నుంచి కీలక సమాచారం అందడంతో అప్రమత్తమైన ధర్మవరం పోలీసులు గత కొద్ది రోజులుగా అతనిపై నిఘాపెట్టారు. నిన్న రాత్రి నూర్ మహమ్మద్ ఇంటి పరిసరాల్లో రెక్కీ నిర్వహించారు. తెల్లవారుజామున డీఎస్పీ నర్సింగప్ప ఆధ్వర్యంలో పోలీసుల బృందం నిందితుడి ఇంటికి వెళ్లి సోదాలు చేశారు. అతను ధర్మవరం మార్కెట్ సమీపంలోని సల్మాన్ బిర్యానీ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేయడంతో అక్కడి ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.నూర్.. పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థల ప్రభావానికి లోనైనట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. నిందితుడు

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# చినబాబు క్యాడర్ కు మంచి కిక్కు ఇస్తున్నట్లుందిగా?

తెలుగుదేశం పార్టీని మూడు రకాలుగా చూడాలి. ఒకటి ఎన్టీ రామారావు హయాంలో.. పార్టీ ఆవిర్భావం నుంచి 1995 వరకూ ఎన్టీఆర్ మాట వేదంగా ఉండేది. పార్టీ క్యాడర్ కు ఆయన మాటలు పూర్తి స్థాయిలో మత్తు నిచ్చేవి. ఆయన డైలాగులతో, హావభావాలతోనే ఆంధ్రప్రదేశ్ లో తొలిసారి పార్టీ పెట్టి ఎనిమిది నెలల్లో అధికారంలోకి తెచ్చిన చరిత్రను గడించారు. అయితే తర్వాత ఆయన శకం పూర్తయిన తర్వాత ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు 1995 నుంచి వచ్చారు. చంద్రబాబు నాయుడు ఆచితూచి వ్యవహరించేవారు. అధికారంలో ఉన్నప్పుడు క్యాడర్ మనసులో ఉన్నది గుర్తించలేకపోయేవారని, అధికారంలో లేనప్పుడు మాత్రం ఆయనకు కార్యకర్తలు గుర్తుకు వచ్చేవారని ఇప్పటికీ పార్టీలో నేతలు అంటుంటారు.

**చంద్రబాబు సాఫ్ట్ కార్నర్...**

1995 నుంచి 2024 వరకూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, పార్టీ అధినేతగా ఆయన నాలుగు సార్లు తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తెచ్చారు. చంద్రబాబు నాయుడు స్వయం శక్తితో ఎదిగిన నేత. తన వ్యూహాలు, రాజకీయ ఎత్తుగడలతో ఎన్టీఆర్ స్థాపించిన పార్టీని ఇప్పటి వరకూ లాక్కుని వచ్చారంటే ఆయన శ్రమ ఫలితమే. నందమూరి వారసులకు పార్టీ చిక్కి ఉంటే ఏమయి పోయి ఉండేదో తెలియదు కానీ, చంద్రబాబు చేతిలో పార్టీ మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లిందని అనేవారు ఇప్పటికీ సీనియర్ నేతలున్నారు. ప్రతి ఎన్నికకు తన వ్యూహాన్ని మారుస్తూ.. ఎక్కడ తగ్గాలో.. ఎక్కడ నెగ్గాలో తెలిసిన నేత చంద్రబాబు నాయుడు అని వేరే చెప్పాల్సిన పనిలేదు. కానీ ఆయన సాఫ్ట్ కార్నర్ సీనియర్ నేతలకు నచ్చుతుందేమో కానీ యువనేతలకు, క్యాడర్ కు నచ్చదు.

**రెడ్ బుక్ నుంచి పులివెందుల వరకూ...**

ఇక పార్టీ అధినేతగా చంద్రబాబు నాయుడు ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రిగా ఆయన కొనసాగుతున్నప్పటికీ ప్రస్తుతం మాత్రం పార్టీలో, ప్రభుత్వంలో లోకేశ్ మాట చెల్లుబాటు అవుతుంది. యువగళం పాదయాత్రతో కార్యకర్తల మనోభావాలను తెలుసుకున్న చినబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు పరుస్తున్నారు. ముఖ్యంగా రెడ్ బుక్ నుంచి నిన్న మొన్నటి పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నిక వరకూ లోకేశ్ ఆదేశాలే పార్టీకి హైప్ తెచ్చాయని చెప్పాలి. గత ప్రభుత్వంలో తాము అనుభవించిన ఆవేదనను చినబాబు తీర్చేస్తున్నారని క్యాడర్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాడు అధికారంలో ఉన్నప్పుడు తమపై చెలరేగిన నేతలను అరెస్ట్ చేయించడంలో చినబాబు ఆదేశాల వల్లనే జరిగిందని బలంగా క్యాడర్ నమ్ముతుంది.

**తగిన రీతిలో బదులివ్వడం...**

అందుకు తగ్గట్లుగానే లోకేశ్ కూడా ఎక్కడకు వెళ్లినా క్యాడర్ తో మమేకమవుతున్నారు. గత ప్రభుత్వంలో తమ పార్టీ నేతలకు, క్యాడర్ కు అన్యాయం చేసిన వారిని వదలడం లేదు. వారు అధికారులు కావచ్చు. ప్రజాప్రతినిధులు కావచ్చు. కత్తికి .. కత్తి.. కేసుకు.. కేసు అన్న రీతిలో ఆయన బదులివ్వడం పసుపు పార్టీ క్యాడర్ లో మంచి హుషారును ఇస్తుంది. అంతేకాదు ఫుల్లు కిక్కుకూడా ఇస్తుంది. అందుకే చినబాబు లోకేశ్ క్యాడర్ గురించి చేసే ఏ ఆలోచనలోనూ వెనుకంజ వేయడం లేదు. ఒకరకంగా చెప్పాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రిగా బిజీగా గడుపుతున్నప్పటికీ పార్టీ బాగోగులను, క్యాడర్ సంక్షేమాన్ని మాత్రం లోకేశ్ పట్టించుకుంటున్నారని సోషల్ మీడియాలో కూడా పెద్దయెత్తున ఆయనను ప్రశంసిస్తూ పోస్టింగ్ లు కనిపిస్తున్నాయి. మొత్తం మీద నారా లోకేశ్ ప్రత్యర్థులను తొక్కి నార తీస్తున్నాడన్న సంతోషం మాత్రం తెలుగు తమ్ముళ్లలో ఉంది.

# ఏపీలో మరో అల్పపీడనం...

- మొదటి పేజి తరువాయి

ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఇప్పటికే ఉన్న అల్పపీడనానికి ఇది తోడవడంతో, రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపింది. విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, ఈ అల్పపీడనాల ప్రభావంతో కోస్తాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. అదే సమయంలో రాయలసీమ ప్రాంతంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం నమోదవుతుందని ఆయన అంచనా వేశారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండే ప్రమాదం ఉన్నందున, మత్స్యకారులు మంగళవారం వరకు వేటకు వెళ్లరాదని ఆయన స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఆదివారం నాటి వాతావరణ పరిస్థితులపై మాట్లాడుతూ, ఉత్తర కోస్తాలోని అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులు ఉంటాయని వివరించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

## ఉలిక్కిపడిన ధర్మవరం.. ఉగ్రసంస్థలతో లింకులపై నోరు విప్పని నూర్ మహమ్మద్

- మొదటి పేజి తరువాయి

పాక్‌లోని ఉగ్రసంస్థలతో నిత్యం వాట్సాప్ చాటింగ్ చేస్తూ.. సుమారు 30 ఉగ్రవాద సంస్థల్లో సభ్యుడిగా ఉన్నట్టు గుర్తించారు. నిందితుడి ఇంట్లో కొన్ని సిమ్ కార్డులు, ఉగ్రవాదాన్ని ప్రేరేపించే పుస్తకాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటిని విశ్లేషిస్తున్నారు. సిమ్ కార్డులు ఎక్కడ కొనుగోలు చేశాడు? ఎలా వినియోగిస్తున్నాడు? ఒక్కో సిమ్ కార్డుతో ఎన్ని వాట్సాప్ గ్రూప్‌ల్లో సభ్యుడిగా ఉన్నాడు? ఏయే విషయాలపై చాటింగ్ చేశాడన్న విషయాలను పరిశీలిస్తున్నారు. ఫోన్ కాల్స్‌కు సంబంధించిన సమాచారం కోసం ఆయా సిమ్ నెట్ వర్క్ సంస్థల నుంచి సేకరించేందుకు అధికారికంగా మెయిల్స్ పెడుతున్నారు. సింధూర్ ఘటన తరువాత పాకిస్థాన్‌లోని తీవ్రవాద సంస్థలతో నూర్ మహమ్మద్ ఎక్కువ సార్లు మాట్లాడినట్టు సమాచారం. నిందితుడు నూర్ మహమ్మద్‌ను పోలీసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారించారు. నిందితుడి కుటుంబంలో తగాదాల కారణంగా భార్య.. నూర్ మహమ్మద్‌ను వదిలి వేరుగా ఉంటున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమంలోనే తాడిపత్రిలో ఓ మహిళతో ఇతనికి వివాహేతర సంబంధం ఉన్నట్టుగా గుర్తించిన పోలీసులు.. ఆమె గురించి మధ్యాహ్నం వరకు విచారించారు. పాకిస్థాన్ తీవ్రవాద సంస్థలతో ఆ మహిళకు కూడా ఏమైనా సంబంధాలు ఉన్నాయా?అన్న కోణంలో ప్రశ్నించారు. మార్కెట్ సమీపంలోని సల్మా బిర్యానీ హోటల్ చుట్టపక్కల కూడా నిందితుడికి సంబంధించిన కొంత సమాచారాన్ని పోలీసులు సేకరించారు. నిందితుడు నూర్ పై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు, సాయంత్రం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం కదిరిలో న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. నూర్ మహమ్మద్‌కు న్యాయమూర్తి ఈ నెల 29 వరకు రిమాండ్ విధించారు. అనంతరం నిందితుడిని ధర్మవరం పోలీసులు కడప జైలుకు తరలించారు.నూర్ మహమ్మద్‌ను విచారిస్తుండగానే ధర్మవరం ఎర్రగుంట కాలనీకి చెందిన రియాజ్ అనే ఆటో డ్రైవర్ భారతదేశానికి వ్యతిరేకంగా, పాక్‌కు అనుకూలంగా వాట్సాప్ డీపీ పెట్టుకున్న విషయాన్ని పోలీసులు గుర్తించారు. రియాజ్‌ను కుడా అదుపులోకి తీసుకొని డీఎస్పీ కార్యాలయంలో విచారిస్తున్నారు. అయితే, నూర్ మహమ్మద్‌కు, రియాజ్‌కు సంబంధాలున్నట్లు పోలీసులకు ఎలాంటి ఆధారాలు లభించలేదనేది సమాచారం.

## ట్రంప్ హయాంలో రష్యాతో వాణిజ్యం 20 శాతం పెరిగిందన్న పుతిన్

- మొదటి పేజి తరువాయి

మాట్లాడుతూ, ట్రంప్ పరిపాలనలో అమెరికా, రష్యా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 20 శాతం పెరిగిందని ఆయన తెలిపారు."ఇది కేవలం సాంకేతికపరమైన సంఖ్యే అయినప్పటికీ, వాస్తవానికి వాణిజ్యం వృద్ధి చెందింది. సహకారానికి మాకు చాలా ఆసక్తికరమైన రంగాలు ఉన్నాయి" అని పుతిన్ అన్నారు. ఇంధనం, డిజిటల్ టెక్నాలజీ, అంతరిక్షం వంటి రంగాల్లో కలిసి పనిచేసేందుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని ఆయన వివరించారు.

**ట్రంప్ వైఖరిలో మార్పు**

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై కఠినమైన సుంకాలు విధిస్తామని హెచ్చరించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆ తర్వాత తన వైఖరిలో మార్పు వచ్చినట్లు సంకేతాలిచ్చారు. భారత్‌పై 'సెకండరీ టారిఫ్'లు విధించాల్సిన అవసరం బహుశా రాకపోవచ్చని ఆయన సూచనప్రాయంగా తెలిపారు."భారత్ వంటి ఒక పెద్ద ఆయిల్ క్లయింట్‌ను రష్యా కోల్పోయింది. నేను సెకండరీ టారిఫ్ విధిస్తే, అది వారికి చాలా నష్టాన్ని కలిగిస్తుంది. అవసరమైతేనే ఆ పని చేస్తాను. బహుశా చేయాల్సిన అవసరం రాకపోవచ్చు" అని ఆయన పేర్కొన్నారు. ముందుగా ప్రకటించిన ప్రకారం, రష్యా నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై 25 శాతం సుంకాలు ఆగస్టు 27 నుంచి అమల్లోకి రావాల్సి ఉంది.పుతిన్ తో ట్రంప్ సమావేశం విజయవంతం కాకపోతే భారత్‌పై సుంకాలు మరింత పెరిగే అవకాశం ఉందని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ కొద్ది రోజుల క్రితం హెచ్చరించారు. అయితే, రష్యాతో ఆర్థిక సహకారం వల్ల తమకే ప్రయోజనం ఉంటుందని అమెరికా భావిస్తున్నట్లు రష్యా వార్తా సంస్థ 'టాస్' పేర్కొంది.

## సూపర్ సిక్స్... సూపర్ ఫ్లాప్

- మొదటి పేజి తరువాయి

బిడ్డలకు పథకంలో కోత పెట్టారు. రూ.15 వేలు ఇస్తామని రూ.13 వేలకు సరిపెట్టారు. మూడు సిలిండర్లు ఎంత మందికి అందుతున్నాయో అర్థంకాని పరిస్థితి! 14 నెలల తర్వాత ఫ్రీ బస్సు అమలు చేసి, సూపర్ సిక్స్ హామీలను ఉద్ధరించామని చెప్పుకోవడం నిజంగా సిగ్గుచేటు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అనడం హాస్యాస్పదం.

చంద్రబాబు గారు రాష్ట్ర ప్రజలకు చేసింది ఘరానా మోసం. రాష్ట్రంలో సంక్షేమం సన్నగిల్లింది. అభివృద్ధి అటకెక్కింది. సుపరిపాలన కొండెక్కింది. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో హామీలు ఘనం... అమలు మాత్రం అరచేతిలో వైకుంఠం" అంటూ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు.

## కుక్కల ప్రేమికులు పేదలను దత్తత తీసుకుని వీధులను కుక్కలకు వదిలేయాలి

- మొదటి పేజి తరువాయి

కుటుంబ సభ్యులతో సమానం అయితే, మీ ఇంట్లోని పెంపుడు కుక్కలనే ఎందుకు పెళ్లి చేసుకోకూడదు?" అంటూ వర్మ సూటిగా ప్రశ్నించారు. అంతేకాకుండా, "పేదలందరినీ మీ ఇళ్లలోకి తెచ్చుకుని, వీధులను పూర్తిగా కుక్కలకే వదిలేయొచ్చు కదా?" అని ఆయన తనదైన శైలిలో ఎద్దేవా చేశారు. పాలకుల మౌనం కన్నా వీధికుక్కల అరుపులే మేలని, అందుకే పాలకుల స్థానంలో వాటినే కూర్చోబెట్టాలని వ్యాఖ్యానించారు.వర్మ తన వ్యంగ్యాన్ని మరింత తీవ్రతరం చేస్తూ, "మీ పిల్లలను వీధికుక్కల గుంపుతో ఆడుకోవడానికి పంపించి, ప్రకృతితో బంధం పెంచుకోమని చెప్పగలరా?" అని నిలదీశారు. కుక్కలకు కూడా పిల్లలతో సమాన హక్కులు ఉన్నాయని భావిస్తే, వీధికుక్కల కోసం పాఠశాలలు, పిల్లల కోసం కొట్టాలు (కెన్నెల్స్) నిర్మించాలని అన్నారు. అనారోగ్యం వస్తే ఆసుపత్రికి బదులు వెటర్నరీ డాక్టర్ వద్దకు వెళ్లి చికిత్స చేయించుకోవాలని శునక ప్రియులకు ఆయన సలహా ఇచ్చారు.

"కుక్కలను దేవుళ్ల కంటే ఎక్కువగా పూజిస్తున్నారు కాబట్టి, దేవాలయాల్లోని విగ్రహాలను తొలగించి, వాటి స్థానంలో వీధికుక్కలను పెట్టి మోక్షం కోసం ప్రార్థించండి," అని వర్మ వ్యాఖ్యానించారు.ప్రస్తుతం రామ్ గోపాల్ వర్మ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఆయన అభిప్రాయాలను కొందరు సమర్థిస్తుండగా, జంతు ప్రేమికులు, శునక ప్రియులు మాత్రం తీవ్రంగా ఖండిస్తున్నారు.

## 'స్త్రీ శక్తి' పథకంపై నారా లోకేశ్ ఆసక్తికర ట్వీట్

- మొదటి పేజి తరువాయి

సూపర్ సిక్స్ హామీలలో ఒకటైన ఈ పథకాన్ని ప్రారంభించడం గర్వంగా ఉందని తన పోస్టులో పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం కేవలం ఒక సౌకర్యం మాత్రమే కాదని, అది వారి స్వేచ్ఛకు, గౌరవానికి, ప్రభుత్వంపై వారికున్న నమ్మకానికి నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. "ఈ ఉచిత బస్సు టికెట్ మహిళల సాధికారతకు ప్రతీక. ఇది కేవలం ప్రయాణం కాదు, సమాన అవకాశాల దిశగా వేస్తున్న ఒక ముందడుగు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళా సాధికారతకు మా ప్రభుత్వం పట్టం కట్టింది" అని లోకేశ్ తెలిపారు. ఈ చారిత్రక సందర్భాన్ని ఒక వేడుకలా జరుపుకోవాలని ఆయన రాష్ట్రంలోని మహిళలకు పిలుపునిచ్చారు. ప్రయాణ సమయంలో తమ ఉచిత బస్సు టికెట్‌తో సెల్ఫీ దిగి, మహిళా సాధికారత అంటే ఏమిటో ప్రపంచానికి చాటిచెప్పాలని ఆయన కోరారు.

## భారత గగనతలానికి 'సుదర్శన చక్రం'... ఇక శత్రువుల ఆటలు సాగవు!

- మొదటి పేజి తరువాయి

నరేంద్ర మోదీ మొన్న (శుక్రవారం) ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మిషన్ కింద దేశవ్యాప్తంగా బహుళ-స్థాయి గగనతల, క్షిపణి రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. 2035 నాటికి దేశంలోని ప్రతి పౌరుడికి, కీలకమైన మౌలిక సదుపాయాలకు సంపూర్ణ రక్షణ కల్పించడమే ఈ బృహత్తర కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం. పాకిస్థాన్‌తో సరిహద్దుల్లో ఉద్రిక్తతలు చోటుచేసుకున్న మూడు నెలల తర్వాత ఈ కీలక ప్రకటన రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, "ప్రతి పౌరుడికీ రక్షణ లభించాలి. శత్రువు ఏ సాంకేతికతతో దాడి చేసినా, దాన్ని అధిగమించే టెక్నాలజీ మన దగ్గర ఉండాలి" అని స్పష్టం చేశారు. మహాభారతంలో శ్రీకృష్ణుడు ఉపయోగించిన సుదర్శన చక్రంలా, ఈ వ్యవస్థ కూడా శత్రు లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించగలదని ఆయన అన్నారు.

**అసలేంటి 'సుదర్శన చక్రం'?**

'మిషన్ సుదర్శన చక్రం' అనేది కేవలం ఒక ఆయుధం కాదు. ఇదొక సమీకృత, అత్యాధునిక రక్షణ కవచం. ఇందులో భాగంగా అంతరిక్ష ఆధారిత వ్యవస్థలు, శక్తిమంతమైన రాడార్లు, అత్యాధునిక సెన్సార్లు, కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాలు, భూమి, సముద్రం నుంచి ప్రయోగించగల ఇంటర్‌సెప్టర్ క్షిపణుల నెట్‌వర్క్‌ను దేశవ్యాప్తంగా నిర్మిస్తారు. రైల్వే స్టేషన్లు, ఆసుపత్రులు, మతపరమైన కేంద్రాలు, ఇతర కీలక పౌర, సైనిక స్థావరాలను శత్రువుల క్షిపణులు, డ్రోన్లు, యుద్ధ విమానాల దాడుల నుంచి కాపాడటమే దీని ప్రధాన ఉద్దేశం. ఈ వ్యవస్థ ద్వారా ముప్పును ముందుగానే పసిగట్టి, గగనతలంలోనే దానిని నిర్వీర్యం చేస్తారు.

**రక్షణతో పాటు ప్రతిదాడి సామర్థ్యం**

ఈ మిషన్ కేవలం రక్షణకే పరిమితం కాదు, శత్రువుపై బహుళ రెట్ల శక్తితో ప్రతిదాడి చేసే సామర్థ్యాన్ని కూడా కలిగి ఉంటుంది. ఇందులో భాగంగా భారత అమ్ములపొదిలోకి కొత్త తరం క్షిపణులను చేర్చనున్నారు. 500 కిలోమీటర్ల పరిధి కలిగిన 'ప్రళయ్' క్వాసీ-బాలిస్టిక్ క్షిపణి, 1,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల సబ్‌సోనిక్ లాంగ్-రేంజ్ క్రూయిజ్ క్షిపణి వంటివి ఈ వ్యవస్థలో భాగం కానున్నాయి. అంతేకాకుండా, ఇప్పటికే భారత త్రివిధ దళాలకు వెన్నెముకగా ఉన్న బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి పరిధిని 450 కిలోమీటర్ల నుంచి 800 కిలోమీటర్లకు పెంచే ప్రక్రియ కూడా కొనసాగుతోంది.

**ఇప్పటికే నిరూపితమైన పటిష్ఠ వ్యవస్థ**

భారత్ ఇప్పటికే తన గగనతల రక్షణ సామర్థ్యాన్ని పలుమార్లు నిరూపించుకుంది. ఇటీవల భారత వాయుసేన చీఫ్ ఎ.పి. సింగ్ వెల్లడించిన దాని ప్రకారం, రష్యా నుంచి కొనుగోలు చేసిన %ూ%-400 గగనతల రక్షణ వ్యవస్థ... పాకిస్థాన్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను, ఒక భారీ నిఘా విమానాన్ని ఏకంగా 300 కిలోమీటర్ల దూరంలోనే గుర్తించి కూల్చివేసింది. అలాగే, మే 7-10 తేదీల్లో జరిగిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో టర్కీ డ్రోన్లు, చైనా క్షిపణుల దాడులను భారత రక్షణ వ్యవస్థలు విజయవంతంగా తిప్పికొట్టాయి. ఈ అనుభవాల పునాదిపై 'సుదర్శన చక్రం'ను మరింత పటిష్ఠంగా నిర్మించనున్నారు.

**భవిష్యత్ ప్రణాళికలు**

ఈ మిషన్‌లో భాగంగా డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో పలు కీలక ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయి. 'ప్రాజెక్ట్ కుశ' పేరుతో స్వదేశీ లాంగ్-రేంజ్ సర్ఫేస్-టు-ఎయిర్ మిస్సైల్ ( వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. ఇది 150 కి.మీ., 250 కి.మీ., 350 కి.మీ. దూరంలోని శత్రు లక్ష్యాలను అడ్డుకో గలదు. దీని మొదటి దశ 2028-29 నాటికి అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు.

దీనితో పాటు, 2,000 కిలోమీటర్ల దూరంలోని బాలిస్టిక్ క్షిపణులను వాతావరణం లోపల, వెలుపల ధ్వంసం చేయగల రెండంచెల బాలిస్టిక్ క్షిపణి రక్షణ

వ్యవస్థ మొదటి దశకు త్వరలో ఆమోదం లభించనుంది. గత ఏడాది 5,000 కిలోమీటర్ల పరిధి గల అణు క్షిపణులను సైతం ఎదుర్కోగల రెండో దశ బీఎండీ పరీక్ష విజయవంతమైంది. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయితే, భారత గగనతలం అక్షరాలా అభేద్యంగా మారుతుంది.

## బిహార్ లో 'ఓట్ అధికార్ యాత్ర' చేపట్టిన రాహుల్ గాంధీ

- మొదటి పేజి తరువాయి

బాట పట్టారు. ఎన్నికల సంఘం (ఈసీ) తీరుకు నిరసనగా ఆయన శనివారం 'ఓట్ అధికార్ యాత్ర'ను ప్రారంభించారు. ఈ యాత్ర రాష్ట్రవ్యాప్తంగా 16 రోజుల పాటు సాగనుంది.ఆదివారం నుంచి లాంఛనంగా ప్రారంభం కానున్న ఈ యాత్ర 23 జిల్లాల మీదుగా కొనసాగనుంది. ససారామ్‌లో ఈ యాత్రను ప్రారంభించారు. ఈ నిరసన కార్యక్రమానికి మహాగఠ్‌బంధన్ మిత్రపక్షాలు కూడా పూర్తి మద్దతు ప్రకటించాయి. కాంగ్రెస్‌తో కలిసి తాము కూడా ప్రజలను సమీకరిస్తామని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తెలిపారు.బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై విపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈసీ, బీజేపీతో కుమ్మక్కై ఓట్లను తొలగిస్తోందని ఆగస్టు 7న రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. దీనికి ఆధారంగా కర్ణాటకలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్ డేటాను ఆయన ప్రస్తావించారు. అయితే, ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం తీవ్రంగా ఖండించింది. అఫిడవిట్ రూపంలో ఫిర్యాదు చేయాలని కోరగా, తాను రాజ్యాంగంపై ప్రమాణం చేసినందున ఆ అవసరం లేదని రాహుల్ బదులిచ్చారు."ప్రతి వ్యక్తికి ఒక ఓటు అనేది ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు. దానిని కాపాడేందుకే ఈ పోరాటం. రాజ్యాంగ పరిరక్షణ కోసం బీహార్‌లో మాతో కలవండి" అని రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా పిలుపునిచ్చారు. మరోవైపు, తేజస్వీ యాదవ్ ఈ యాత్ర కోసం ఒక ప్రచార గీతాన్ని విడుదల చేశారు. "ఏ ఒక్క ఓటరు పేరు జాబితా నుంచి పోకూడదు. ప్రజల్లో చైతన్యం తేవడమే మా లక్ష్యం" అని ఆయన స్పష్టం చేశారు. బీహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించారని సుప్రీంకోర్టు పేర్కొన్న విషయాన్ని కూడా విపక్షాలు ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాయి.

## బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించే అధికారం కోర్టుకు ఉండదు

- మొదటి పేజి తరువాయి

గందరగోళానికి దారితీస్తుందని తన అభిప్రాయాన్ని వెల్లడించింది. అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్లు నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వవచ్చా? అనే అంశంపై సుప్రీంకోర్టు జారీచేసిన నోటీసులకు కేంద్రం ఈ మేరకు బదులిచ్చింది.బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి గడువు విధించడం ద్వారా రాష్ట్రపతి, గవర్నర్ల వంటి అత్యున్నత పదవుల గౌరవాన్ని తగ్గించినట్లు అవుతుందని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ రెండు పదవులు ప్రజాస్వామ్య పాలనలో ఉన్నత పదవులని పేర్కొంది. వారి అధికారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవడం సరైన విధానం కాదని తెలిపింది.ద

ఒకవేళ వారి విధి నిర్వహణలో ఏవైనా లోపాలు తలెత్తితే, వాటిని న్యాయవ్యవస్థ జోక్యంతో కాకుండా రాజ్యాంగబద్ధమైన యంత్రాంగాల ద్వారానే సరిదిద్దాలని కేంద్రం సుప్రీంకోర్టుకు విన్నవించింది. ఈ రకమైన జోక్యం వల్ల కొన్ని అనవసర సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉందని తన అఫిడవిట్‌లో పేర్కొంది.





తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఉత్సవర్లకు తిరువీధి ఉత్సవం

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

# చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి

## రాష్ట్ర మంత్రి టి.జి భరత్



**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 16 :** సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర మంత్రి టి.జి భరత్ అన్నారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా మార్కెట్ యార్డు సెక్రటరీ విజయలక్ష్మి.. ఛైర్మన్‌గా గోల్కొండ అజ్మత్ బీతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ తర్వాత వైస్ ఛైర్మన్ శేషగిరి శెట్టి, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మంత్రి టి.జి భరత్ మాట్లాడారు. తనను నమ్ముకున్న క్యాడర్‌కు తప్పకుండా న్యాయం చేస్తానని చెప్పారు. టిడిపి మైనారిటీ టౌన్ ప్రెసిడెంట్ హమీద్ తన గెలుపు కోసం కృషి చేశారన్నారు. ఆయనకు ఇచ్చిన మాట ప్రకారం అజ్మద్ బీ కి ఛైర్మన్ పదవి ఇవ్వడం జరిగిందన్నారు. అన్నీ కలిసి రావడం వల్ల ఈ కొత్త కమిటీ ఏర్పడిందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన సమయంలో ఎంత ఆనందం కలిగిందో.. ఈ ఛైర్మన్ పదవి వీరికి రావడం వల్ల అంతే సంతోషంగా ఉందని మంత్రి చెప్పారు. కొత్త కమిటీకి ఆయన శుభాకాంక్షలు తెలియజేసి.. మార్కెట్ యార్డు అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆయన కోరారు. గతంలో ఈ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, డైరెక్టర్ల పోస్టులు డబ్బులకు అమ్ముకునే వారన్నారు. తన దగ్గర అలాంటివి ఉండవన్నారు. కష్టపడిన వారికి తప్పకుండా న్యాయం చేస్తానని చెప్పారు. కర్నూలు ప్రజలకు సేవ చేసేందుకు తాను రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పారు. తమను ముస్లింలకు దూరం చేసేందుకు కొందరు కుట్రలు పన్నుతారన్నారు. తాము మాత్రం కుల, మత బేధాలు లేకుండా అందరినీ ఒకేలా చూస్తామన్నారు. ఇందుకు నిదర్శనమే ముస్లిం అయిన అజ్మద్ బీకి ఛైర్మన్ పదవి రావడం అన్నారు. ప్రజలు ఇది గుర్తుంచుకోవాలని మంత్రి చెప్పారు. తమ ప్రభుత్వం ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే మరోవైపు రాష్ట్రాన్ని అభివృద్ధిని చేస్తుందన్నారు. తమ ప్రభుత్వం మరో రెండు దశాబ్దాల పాటు ఇలాగే కొనసాగితే ప్రజలు కోరుకున్నవన్నీ నెరవేర్చుతామన్నారు. చంద్రబాబు నాయుడు లాంటి విజనరీ లీడర్ ఇంకెక్కడా దొరకరని చెప్పారు. చంద్రబాబు నాయకత్వం, ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రానికి ఎంతో అవసరమని తెలిపారు. ఇక ప్రతిపక్ష పార్టీ నాయకులకు ఎలా మాట్లాడాలో ఇప్పటికీ తెలిసిరాలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వయస్సును ఉద్దేశించి చేస్తున్న వ్యాఖ్యలు ఎంతో బాధాకరమన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు భారీగా పెట్టుబడులు వస్తున్నట్లు తెలిపారు. రిలయన్స్ కంపెనీ 1600 కోట్లతో పెట్టుబడులు పెడుతోందన్నారు. ఇప్పటికే ఉన్న జైరాజ్ ఇస్పాట్ స్టీల్ ఫ్యాక్టరీ కూడా తమ వ్యాపారాన్ని విస్తరించబోతుందన్నారు. ఈ ప్రాంత వాసులకు తప్పకుండా ఇక్కడ ఉద్యోగావకాశాలు దక్కుతాయని మంత్రి టి.జి భరత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ ఆకెపోగు ప్రభాకర్, బొందిలి కార్పొరేషన్ ఛైర్మన్ విక్రమ్ సింగ్, టిడిపి నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, జనసేన నాయకులు అర్షద్, బీజేపీ నాయకులు సూర్య, టిడిపి మైనారిటీ సిటీ ప్రెసిడెంట్ హమీద్, కార్పొరేటర్లు, బూత్ ఇంచార్జీలు, తదితరులు పాల్గొన్నారు.





## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న మంత్రి సత్యకుమార్





**ధర్మవరం, పెన్ పవర్ ఆగస్టు 16 :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ధర్మవరం పట్టణంలోని యాదవ వీధిలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ భగవానునికి ప్రత్యేక పూజలు చేసి, ప్రజల ఆరోగ్యం, సుఖసంతోషాలు మరియు సమృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలు ఆరోగ్య వంతంగా, ఆనందంగా జీవించేలా ప్రభువు ఆశీస్సులు కలగాలని మంత్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఉట్టి కొట్టు మరియు ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి, స్థానిక యువత ప్రదర్శించిన ఉత్సాహాన్ని అభినందించారు. పండుగ సందర్భంలో సమాజం లోని ప్రతి ఒక్కరికి ఐక్యత, ఆనందం మరియు భక్తి వాతావరణం నెలకొని, సంప్రదాయ విలువలను గుర్తుచేసుకోవడంలో శ్రీకృష్ణాష్టమి ప్రత్యేక ప్రాధాన్యత కలిగినదని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షులు డాక్టర్ వివేక్, దేవస్థానం గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, నరసింహులు, ఆర్టీసీ రాము, కేశవ, నాగరాజు, నాగేంద్ర, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న 116 జయంతి మహోత్సవం

### రాష్ట్రవ్యాప్తంగా మొదటి సారి డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు : బి.సి.సంక్షేమ సంఘ నాయకులు



**తిరుపతి, పెన్ పవర్ ఆగస్టు 16 :** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి, రైతు బాంధవ్యుడు, "సర్దార్" అనే బిరుదుతో ప్రసిద్ధి చెందిన డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న గారు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడని, ప్రజల సంక్షేమం కోసం జీవితాంతం పనిచేశారు. స్ఫూర్తిదాయక జీవితం, అందరికి ఆదర్శమని, వారి త్యాగాలను మరువకుండా తప్పక స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్ అన్నారు. శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లోని మీటింగ్ హాలు నందు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి, రైతు బాంధవ్యుడు, సర్దార్ బిరుదాంకితుడు " విప్లవ నాయకుడు " డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి మహోత్సవం సందర్భంగా శ్రీ లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి బి.సి, సంఘి క సంక్షేమ శాఖ అధికారులు, సంఘ నాయకులతో కలసి జిల్లా కలెక్టర్ నివాళులు అర్పించారు. డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న గారు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయ నాయకుడని, విశాఖపట్నం జిల్లాకు చెందినవారని, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని, గౌతు లచ్చన్న సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. "విప్లవ నాయకుడు" (Revolutionary Leader) అనే బిరుదుతో ప్రసిద్ధి చెందారన్నారు. ప్రజల సంక్షేమం కోసం జీవితాంతం పనిచేశారని ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం సంక్షేమ సంఘాల నాయకులు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన "విప్లవ నాయకుడిని" గుర్తించి మొదటి సారి రాష్ట్ర వ్యాప్తంగా ఆయన జయంతి ఉత్సవాన్ని నిర్వహిచూకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల చంగయ్య, అసిస్టెంట్ బి.సి వెల్ఫేర్ అధికారి జ్యోత్స్న,జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి గురుస్వామి శెట్టి, కలెక్టరేట్ కార్యాలయ ఏవో రమేష్ బాబు, తిరుపతి జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ నాగరాజు, సంఘ నాయకులు కిరణ్, వెంకట మణిబాబు, బీసీ సంఘ నాయకులు మనుశేఖర్,మల్లికార్జున, రామారావు, సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దుర్గంధ పూరితంగా నగర మార్కెట్లు

## నిర్వాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షులు డా.యం.సురేష్ బాబు





**అనంతపురం పెన్ పవర్ ఆగస్టు 16 :** అనంతపురం పాతూరు, కొత్తూరు మార్కెట్, గుత్తి రోడ్డులోని మార్కెట్ యార్డ్ ప్రతి రోజు రెండు లక్షల మందికి కాయ గూరలు, పండ్లు సరఫరా అవుతున్నాయి. మార్కెట్‌లో కాయగూరలు పండ్లు నిల్వ చేసే ప్రదేశాలను, కమిషన్ ఏజంట్ల ప్రదేశాలను చూసినట్లయితే అన్నం సహించదు. మార్కెట్లు దుర్గంధ పూరితంగా ఉన్నాయి. మార్కెట్ యార్డ్ ఒకవైపు డంపింగ్ యార్డ్ నుంచి వచ్చే విషవాయువు, మరోవైపు దుర్గంధం, నడవడానికి కూడా సాహసం చేయలేని బహిరంగ మల మూత్ర విసర్జన చేసి విపరీతమైన దుర్గంధం వెదజల్లుతుంటుంది. శనివారం పశువుల సంత తరువాత ఎక్కడి పెండ అక్కడ, గడ్డి, పంట వ్యర్థాలను తొలగించే నాథుడే కరువయ్యాడు. వ్యక్తిగత పరిశుభ్రత, ప్రజా ఆరోగ్య వ్యవస్థను పటిష్ట పర్చడం, రోగాలు ప్రబలకుండా నివారణకు ప్రభుత్వం ప్రథమ కర్తవ్యంగా భావించాలి. మనుషులకు సుఖవిరోచనం లేదా ఏదైనా సరిపడని నూనె వాడిన పదార్థాలు తిన్నపుడు విరేచనాలు, లేదా ప్రయాణ సమయాల్లో విరేచనాలు సహజం. చాలా నగరాల్లో మార్కెట్టుకు కాయగూరలు, పండ్లు, నిత్యావసర సరుకులు గ్రామీణ ప్రాంతాల నుండి లేక సుదూర ప్రాంతాల నుంచి లారీలు, ట్రక్కులు డ్రైవర్లు, హమాలీలు, రైతులకు ఎక్కడ మరుగుదొడ్లు ఉండవు. మరుగుదొడ్లు లేక మార్కెట్టు సమీప ప్రాంతాల్లో మలమూత్ర విసర్జన షాపుల ముందు, నివాస ప్రాంతాల్లో , సెల్లార్లు, మిద్దెల పైన ఎక్కడ పడితే అక్కడ దుర్గంధ పూరితమై ఉంటుంది. పబ్లిక్ టాయిలెట్స్ ఉన్న నిర్వహణ లేక భయంకరంగా ఉంటుంది. లోపలికి వెళితే నరకంలో ఉన్నట్టుంటుంది, బీడీ సిగరెట్ పీకలు, పాన్ బిడాల, గుట్కా లు గోడలపైన, నేలపై ఉమ్మివేయడం సర్వసాధారణ విషయం, గంద్ర చీమలు మట్టి తోడడం, చిలుము పట్టిన బకెట్లు, కింద పడేసిన ముగ్గులు, గొళ్ళాలు లేని రేకు తలుపులు సర్వసాధారణం. ఇక్కడ పబ్లిక్ టాయిలెట్ ఉందని బోర్డు పెట్టనవసరం లేకుండా ఫర్లాంగు దూరం వరకు దుర్గంధం వెదజల్లుతుంటుంది. ఈ రోత భరించలేక పురుషులు చాలా మంది గుట్టు చప్పుడు కాకుండా పబ్లిక్ స్థలాలలో మరుగు చూసుకొని మార్కెట్లోనే పని కానిస్తున్నారు , గత్యంతరం లేక చాటు దొరికితే చాలు కళ్లు మూసుకొని గబ్బుపట్టిస్తున్నారు. ఇక మహిళల సంగతి ఆ దేవుడికెరుక, ఆ సమయంలో మహిళలు సిగ్గుతో తలవంచుకొని వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. నగరల లోని వ్యాపార, వాణిజ్య సముదాయా ల్లోనూ చాలా వాటికి మరుగుదొడ్లు కనిపించడం లేదు. మున్సి పల్ నిబంధనల ప్రకారం ప్రతి అంతస్తుకు సామూహిక మూత్ర శాల ఉండాలి. అలా ఉంటేనే అను మతులు ఇస్తారు. కానీ టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం అవేమీ పట్టించుకోకుండా అనుమతులు ఇచ్చేస్తు న్నారు. రహదారుల్లో అక్కడక్కడ, రైల్వేస్టేషన్లు, బస్ స్టేషన్లు, కూరగాయల, పండ్ల, మటన్, చికెన్, చేపల మార్కెట్‌లలో పరిస్థితులు చాల అధ్వానంగా తయారయ్యాయి. స్వచ్ఛ భారత్‌లో భాగంగా చాల నగరాలు ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ సాధించినా, బహిరంగ మూత్ర విసర్జనను నివారించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. సులభ్ కాంప్లెక్స్ లు మరీ అధ్వాన్నంగా ఉంటున్నాయి. స్వచ్ఛ భారత్ సెస్ ఎందుకు వసూలు చేస్తున్నారో, నిధులు ఎక్కడ ఖర్చు చేస్తున్నారో తెలియని పరిస్థితి, కేవలం నినాదాలకే పరిమితమై ఆచరణలో శూన్యం గా వ్యవహరిస్తున్నది ప్రభుత్వం. రహదారి రవాణా రంగం దేశ ప్రగతికి అత్యంత ముఖ్యమైనది, రవాణా మౌలిక సదుపాయాలు దేశం యొక్క పురోగతికి వేగం మరియు సామర్థ్యాన్ని పెంచుతుంది. వస్తువులను రవాణా చేయడం మరియు పంపిణీ చేయడంలో నగరాల్లో నడుస్తున్న స్థానిక రవాణా కీలక పాత్ర పోషిస్తుంది. భారతదేశంలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్న రంగం రవాణా రంగం, అంతటి ప్రాధాన్యత కలిగిన రవాణా రంగానికి ప్రభుత్వం చేయూతనివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వ్యవస్థలో రవాణా రంగం అతి కీలకమని గుర్తించి ప్రభుత్వం తోడ్పాటు ఇచ్చినట్లయితే ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న ప్రజలు ప్రభుత్వానికి రుణపడి ఉంటారు. గత నాలుగు సంవత్సరాలుగా డీజిల్ పెట్రోల్ ధరలు డెబ్భై శాతం, టోల్ సెస్ విపరీతంగా పెరగడంతో రవాణా రంగానికి గడ్డుకాలం ఏర్పడింది. మరోవైపు రవాణ, పోలీసు అధికారులు వేస్తున్న ఫైన్లు, చలాన్లు బాణాలై గుచ్చుకుంటున్నాయి. ఫైనాన్స్ కంపెనీలు పెనాల్టీలు, అధిక వడ్డీల రూపంలో జలగలై రక్తం జుర్రేస్తున్నాయి. ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలు ఆగిన మూడు చక్రాల బతుకు బండిని చూసి వెక్కిరిస్తున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రవాణా కార్మికులకు సరైన తిండి నీరు సదుపాయాలు లేవు. చిన్న హోటల్స్ ఉన్నా అపరిశుభ్రత వాతావరణంలో, కనీసం చేతులు కడుక్కోవడానికి నీరు ఉండదు. మార్కెట్లను ఆధునీకరించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి, పార్కింగ్ వసతి, తాగునీటి వసతి ప్రభుత్వం కల్పించాలి. రోజూ రెండుసార్లు చెత్త సేకరణ జరగాలి, అలాగే దుర్గంధ పూరిత ప్రదేశాలలో డిడిటి, బ్లీచింగ్ పౌడర్, ఫినల్ పిచికారీ చేయించాలి. రైతులకు రవాణా కార్మికులకు చిన్న వర్తకులకు క్యాంటిన్ సౌకర్యం కల్పించి మెరుగైన వసతులు కల్పించాలి.







## జిల్లా కేంద్రంలో బీసీ భవనం ఏర్పాటుకు 40 సెంట్లు భూమి అందుబాటులో ఉంది

### డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న గారి విగ్రహాన్ని ఏర్పాటు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్





**అనంతపురం,పెన్ పవర్ ఆగస్టు 16 :** భారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి గౌతు లచ్చన్నని జిల్లా రెవిన్యూ అధికారి ఏ.మాలోల పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వము ఆదేశాల మేరకు జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం అనంతపురం జిల్లా కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనం నందు స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ మరియు సాధికార అధికారిణి ఖుష్బూ కొఠారి,బి సి కార్పొరేషన్ ఈ డి సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కలెక్టర్, సచిన్ సహార్, బి సి కార్పొరేషన్ డైరెక్టర్లు, బి సి సంఘాల నాయకుల తో కలసి డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న గారి జయంతి మహోత్సవము సందర్భంగా డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న గారి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించే కార్యక్రమంలో డి ఆర్ ఓ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి ఆర్ ఓ మాట్లాడుతూ భారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి గౌతు లచ్చన్నని, సమాజం కోసం ప్రతినిత్యం శ్రమించిన డాక్టర్ సర్దార్ లచ్చన్న ను ఆదర్శంగా తీసుకొని నేటి నాయకులు సమాజ సేవ చేయాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వము నుంచి రెండు రోజుల క్రితం ఉత్తర్వులు రావడం జరిగిందని అయ్యినపటికి బి సిలకు చెందిన నాయకులు పెద్దఎత్తున పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. స్వాతంత్ర్యమురాక ముందే సమాజం కోసం, ప్రజల కోసం పోరాడిన వ్యక్తి వెనుకబడిన తరగతుల లో వున్నారు అంటే చాలా గొప్ప విషయమని, నేటి సమాజంలో ఇంత అభివృద్ధి చెందుతున్న అలాంటి నాయకున్ని ఆదర్శంగా తీసుకుని సమాజం కోసం పని చేయాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక శాసనసభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు రాష్ట్రంలోనే మొదటిగా డాక్టర్ సర్దార్ గౌతు లక్షన్న గారి జయంతి ఉత్సవాల నిర్వహించుకోవడానికి ఆదేశాలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. బీసీల అన్ని రకాలుగా అభివృద్ధి అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి ముఖ్య ఉద్దేశమని, ముఖ్యమంత్రి మద్యం పాలసీలో సంస్కరణలు తీసుకొచ్చి మద్యం దుకాణాలకు సంబంధించి గీత కార్మికులకు మద్యం షాపుల లో 10 శాతం రిజర్వేషన్ కల్పించి, లైసెన్సులు ఇవ్వడం జరిగిందన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా బీసీలు తల ఎత్తుకునే విధంగా అభివృద్ధి చేయాలన్నదే ముఖ్య మంత్రి ముఖ్య ఉద్దేశం అన్నారు. అనంతపురం జిల్లాకేంద్రం లో బీసీల భవనం నిర్మాణం, మరియు గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటు బీసీలకు ఉన్నటువంటి సమస్యలు నా దృష్టికి తీసుకురావడం జరిగిందని వీటి ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని ముఖ్యమంత్రి ఈ సమస్యల పై సానుకూలంగా స్పందించారని తెలిపారు. పట్టణంలో 40 సెంట్లు స్థలంలో బీసీ భవన్ నిర్మాణానికి అదేవిధంగా డాక్టర్ సర్దార్ గౌతు లక్షన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయుటకు చర్యలు చేపట్టడం జరుగుతుందని బీసీ నాయకులకు సూచించారు. వచ్చే సంవత్సరం నాటికి జిల్లా కేంద్రంలో బీసీ భవనం నిర్మాణం పూర్తి చేసి, బి సి భవనం నందు డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జయంతి ఉత్సవాల నిర్వహించుకోవడంతో పాటుగా సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని బి సి నాయకులకు తెలియజేశారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ దేశం కోసం ప్రజల కోసం అంకితభావంతో అనేక పోరాటాలు చేసి గొప్ప నాయకుడు మరియు సమాజంలో బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి డాక్టర్ సర్దార్ గౌతమ్ లక్షన్న పనిచేయడం జరిగిందని తెలిపారు. డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న శ్రీకాకుళం జిల్లా సోంపేట తాలూకా "బారువ" అనే సముద్రపు ఒడ్డున ఉండి మేజరు పంచాయతీగా ఎదిగిన గ్రామంలో శ్రీ చిట్టియ్య, రాజమ్మ దంపతులకు గౌతు లచ్చన్న 1909 సంవత్సరం ఆగస్టు 16వ తేదీన జన్మించారని, 2006 ఏప్రిల్ 19న మరణించడం జరిగిందని తెలిపారు.గౌతు లచ్చన్నసాహసానికి, కార్యదక్షతకు మెచ్చి ప్రజలిచ్చిన కితాబే సర్దార్. సర్దార్ గౌతు లచ్చన్నని తెలిపారు. 1935లో కాంగ్రెస్ సోషల్ పార్టీకి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడిగా వ్యవహరించారని. రాష్ట్రంలో ఎన్నో రైతు ఉద్యమాలు నడిపారని 1940 సంవత్సరం లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని అరెస్టయిన గౌతు లచ్చన్న మూడేళ్లు జైలు జీవితం గడిపారని తెలిపారు. సర్దార్ గౌతు లచ్చన్న 98 సంవత్సరాలు వృత్తి రాజకీయ నాయకుడుగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో గీత కార్మికులకు లైసెన్సుల ఇవ్వడం జరుగుతుందని, అక్కడ వెళ్లి తెచ్చుకోవాలంటే చాలా ఇబ్బందిగా ఉందని, ఇకమీదట గీత కార్మికులకు సంబంధించిన దుకాణాలకు సంభందించి లైసెన్సులు జిల్లా కలెక్టర్ గారి నుండి పొందే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, జిల్లా అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. అనంతపురము పట్టణంలో డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న విగృహం ఏర్పాటు చేయాలని ఉద్యోగస్తుల స్టేట్ ప్రెసిడెంట్ జి. నాగభూషణం, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఈడికి సంఘం అధ్యక్షులు వేణుగోపాల్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఏ. ఈశ్వరయ్య, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కె. కొండన్న, రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్సీ. పరమేశ్వర్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనరసింహులు, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. నాగభూషణం, ఈడిగ భవన అధ్యక్షుడు నాగేశ్వరావు, జిల్లా గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేంద్ర గౌడ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలనచేసి డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న గారి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో బి సి సంక్షేమ వసతి గృహాల చదువుతున్న బాలికల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బి సి సంక్షేమ శాఖ,సహాయ బి సి సంక్షేమ అధికారిణి సుభాషిణి,అధికారులుసిబ్బంది బి సి కులాలకు చెందిన ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణుని ప్రవర్తన-రహస్యం

### ఈ శ్రీకృష్ణ రహస్యం.. సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి సేకరణ సింధూ...





Shri.S.Krishna Reddy
REGIONAL DIRECTOR, EDUCATIONAL CELL, A.P&TS

**కడప పెన్ పవర్ ఆగష్టు 16 :** మహాభారతంలో శ్రీకృష్ణుని మించిన ఆకర్షణీయమైన పాత్ర ఉండదు. మహాభారతం చదివినవారికి అలాంటి శ్రీకృష్ణుడి పాత్రపై కూడా ఎన్నో అనుమానాలు కలుగుతుంటాయి. కృష్ణుడు అండగా ఉన్నా కూడా పాండవులు ఎందుకు అన్ని కష్టాలు పడ్డారు ? ద్రౌపది పిలిస్తే కాని కృష్ణుడు రాకూడదా ? ధర్మరాజుని జూదానికి వెళ్ళకుండా కృష్ణుడు ఆపి ఉండొచ్చు కదా ? సుయోధనుడు శకునితో ఆడించినట్టు, ధర్మరాజు కృష్ణుడితో ఆడించి ఉండొచ్చు కదా ? ఇవన్నీ ఎందుకు జరగలేదు ? ఆపదల్లో కూరుకుపోయినప్పుడు తప్ప ఆపద రాకుండా ఆపలేడా ? ఇలాంటి ప్రశ్నలెన్నో సహజంగానే వస్తాయి. వీటికి సమాధానం కూడా శ్రీకృష్ణుడే చెప్పాడు. మనకు కాదండోయ్.. శ్రీకృష్ణుడి బాల్య స్నేహితుడైన ఉద్ధవుడు.. మహాభారతం చివర్లో శ్రీకృష్ణుడిని ఉద్ధవుడు పై ప్రశ్నలే అడిగాడు.. శ్రీకృష్ణుడు ఏం అడిగాడు.. ఉద్దవుడు ఏం చెప్పాడో.. చూద్దాం.. ఉద్ధవుడు : మరి నువ్వు పాండవులకు అత్యంత ఆప్తుడివి కదా.., ధర్మరాజు జూదం ఆడకుండా ఆపొచ్చు లేదా ధర్మరాజు తరుపున నువ్వు ఆడి ఉండొచ్చు కదా?

కృష్ణుడు : ఉద్దవా ! గుర్తుపెట్టుకో, ఎప్పుడూ వివేకం ఉన్నవాడిదే గెలుపు. సుయోధనుడు వివేకవంతుడు, తనకి ఆట రాదు కనుక శకునితో ఆడించాడు. ధర్మరాజుకు ఆ వివేకం లేదు. ధర్మరాజు కూడా నన్ను ఆడమని అడిగి ఉంటె వేరేలా ఉండేది, కాని అతను అలా చేయలేదు. నేను అతను పిలుస్తాడని ఆ గుమ్మం ముందే ఎదురు చూస్తున్నాను. అతను పిలవలేదు సరి కదా, నేను అటువైపు రాకూడదని ప్రార్ధించాడు. అతని ప్రార్ధన మన్నించి నేను వెళ్ళలేదు. మిగిలిన పాండవులు అందరూ ఓడిపోయినందుకు ధర్మరాజుని తిడుతున్నారే కాని నన్ను పిలవలేదు. ద్రౌపది కూడా వస్త్రాలు తొలిగించే వరకు నన్ను స్మరించలేదు. నన్ను పిలిచి ఉంటే రాకుండా ఉంటానా.

ఉద్ధవుడు : అంటే తీవ్రమైన ఆపదల్లో కూరుకుపోయి పిలిస్తే కాని రావా ?

కృష్ణుడు : జీవితంలో జరిగే ప్రతీది కర్మానుసారం జరుగుతుంది. నేను కర్మని మార్చలేను, కాని మీ పక్కనే ఉండి ప్రతీదీ గమనిస్తూ ఉంటాను.

ఉద్ధవుడు : అంటే మా పక్కనే ఉండి, మేము కష్టాలలో, ఆపదల్లో , చిక్కుల్లో కూరుకుపోతుంటే చూస్తూ ఉంటావే తప్ప ఏమి చేయవా?

కృష్ణుడు : ఉద్దవా ! ఇక్కడే నువ్వు ఓ విషయం గమనించడం లేదు. నేను పక్కనే ఉన్నానని నువ్వు గుర్తించగలిగితే అసలు తప్పు ఎలా చేయగలవ్. కానీ మీరు నేను ఉన్నాను అనే విషయం మర్చిపోయి.. నాకు తెలీదు అనుకోని, ప్రతీది చేస్తుంటారు అందుకే ఇబ్బందుల్లో పడతారు. అదీ కృష్ణుడు చెప్పిన రహస్యం. కృష్ణుడు నిత్యం మన పక్కనే ఉంటాడు అనే దృష్టి ఉంటే చాలు. పూజలు ఏమీ అవసరం లేదు. ఆయన పక్కనే ఉన్నాడు, అన్నీ చూస్తున్నాడు అని గుర్తుంచుకుంటే.. మన జీవితం సాఫీగా సాగిపోతుంది. ఇదే ఉద్ధవుడికి శ్రీకృష్ణుడు చెప్పిన కీలకమైన రహస్యం.

### ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన

# అర్జీలను స్వీకరించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి


**బనగానపల్లి పెన్ పవర్ ఆగష్టు 16 :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్క రించాలని అధికారులకు రాష్ట్ర రోడ్లు&భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశించారు. నేటి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను మంత్రి స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడిక్కడే ఫోన్ లో మాట్లాడి పరిష్కరించడం జరిగింది. ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమంలో ఆయా సమస్యలపై మంత్రి స్పందించిన తీరుతో బాధితుల నుంచి ఆనందం వ్యక్తం అవుతుంది. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి



# మనం ఒక వ్యక్తిని చాలా ఇష్టపడవచ్చు, కానీ ఇంకొకరు అదే వ్యక్తిని అంతగా ఇష్టపడకపోవచ్చు ...

### కారణం ఏమైఉండవచ్చు?...సింధూ కృష్ణారెడ్డి





కడప పెన్ పవర్ ఆగష్టు 16 : నిష్పక్షపాత దృష్టి చాలా కాలం క్రితం, చాలా ప్రార్థనల తరువాత, ఎట్టకేలకు అక్బర్ కు సలీం రూపంలో ఒక బిడ్డ జన్మించాడు. అక్బర్ సలీం అందాన్ని, ఆటపాటలను ఎంత ఆస్వాదించాడంటే, ఒకరోజు బీర్బల్ తో ఇలా అన్నాడు – "బీర్బల్! సలీం అంత అందగాడిని, అంత అల్లరిగా ఉండే చిలిపి పిల్లవాడిని నువ్వు ఎప్పుడైనా చూశావా? సలీం అందం, చురుకుదనం రెండూ చరిత్ర ప్రసిద్ధమైనవి కదా?" అది విని బీర్బల్ నవ్వుతూ ఇలా అన్నాడు – "నిజంగా చెప్పాలంటే, జహాపనా, నేను అలా అనుకోను. నేను అటువంటి పిల్లలను వేలమందిని చూశాను."

అక్బర్ నవ్వుతూ అన్నాడు – "బీర్బల్! నీకు పరిహాసం చేసే అలవాటు ఇంకా పోలేదు." బీర్బల్ చాలా గంభీరంగా – "జహాపనా ! నేను తమాషా చేయడం లేదు, నేను నిజంగా అలాంటి పిల్లలను వేలమందిని చూశాను." అక్బర్ కూడా ఇప్పుడు అదే గంభీరతతో – "సరే, నాకు అలాంటి పిల్లవాడ్ని తీసుకొచ్చి చూపించు!" బీర్బల్ – "రేపే అలాంటి బిడ్డను మీకు చూపిస్తాను."

బీర్బల్ వెళ్ళిపోయాడు, కానీ అక్బర్ రాత్రంతా నిద్రపోలేదు. "నిజంగా సలీం కంటే అందమైన పిల్లవాడు అసలు ఇంకొకరు ఉంటారా? మరి సలీం కంటే అందమైనవారిని వేలమందిని చూశానని బీర్బల్ చెబుతున్నాడే! సరే, ఇంక ఒక్క రోజు ఆగితే ... రేపు తేలిపోతుంది, నిజం బయటకు వస్తుంది." రాత్రంతా ఇలాంటి ఆలోచనలు కొనసాగాయి. మరుసటి రోజు ఉదయం, ముఖం మీద చాలా మొటిమలు ఉండి, కారుతున్న ముక్కుతో, మురికిగా ఉన్న ఒక బాలుడితో బీర్బల్ రాజదర్బార్ కు హాజరయ్యాడు. ఆ బాలుడిని చూసిన వెంటనే అక్బర్ చాలా కోపంతో, "బీర్బల్, ఏమిటి ఈ పరిహాసం? ఈ పిల్లాడిని నా యువరాజు సలీంతో ఎలా పోల్చగలవు?" అని అడిగాడు. బీర్బల్ – "పరిహాసం కాదు జహాపనా! మీరు ఒప్పుకోకపోతే నాతో రండి. ఈ పిల్లాడు సలీం కంటే అందంగా లేడనుకుంటే, సలీమ్ కంటే తక్కువ కూడా కాదని నేను మీకు నిరూపిస్తాను." అక్బర్ వెంటనే బీర్బల్ తో వెళ్ళాడు. బీర్బల్, అక్బర్ ను ఒక మురికివాడలాంటి ప్రదేశానికి తీసుకెళ్లాడు. అప్పుడు ఆ అబ్బాయిని వారితో పాటు వచ్చిన సైనికుడికి అప్పగించి, అక్బర్ తో కలిసి ఒక గుడిసె ముందు ఆగాడు. అక్కడ ఒక స్త్రీ పెద్దగా ఏడుస్తోంది. బీర్బల్ ఆమెను – "ఏమైంది తల్లీ? ఎందుకు అంత గట్టిగా ఏడుస్తున్నావు?" అని అడిగాడు. అప్పుడు ఆ స్త్రీ – "నా బిడ్డ కనిపించట్లేదు", అని రోదిస్తూ చెప్పింది.

బీర్బల్ ఇలా అన్నాడు– "సరే! అతను ఎలా ఉంటాడో చెప్పు, అతనిని వెతకడంలో నేను నీకు సహాయం చేస్తాను". ఆ మహిళ ఇలా చెప్పింది – "నా బాబు గురించి నేనేం చెప్పను! నా బాబు చాలా అందంగా ఉంటాడు, వాడు నా కంటికి రెప్పలాంటివాడు. ఈ రాజ్యం మొత్తంలోకెల్లా అతని కంటే అందమైన పిల్లాడు మరొకడు ఉంటాడని నేను అనుకోను. మీకు చాలా అందమైన, ఉల్లాసంగా, చురుకుగా ఉన్న పిల్లవాడు ఎక్కడైనా ఒంటరిగా దొరికితే, అతను నా బిడ్డ అని మీరు ఖచ్చితంగా తెలుసుకోవచ్చు." ఆ మహిళ నోటి నుంచి ఆ చిన్నారి వర్ణన విని అక్బర్ ఆశ్చర్యపోయాడు. మరోవైపు, బీర్బల్ చాలా మాములుగా కొనసాగిస్తూ, ఆ స్త్రీతో ఇలా అన్నాడు – "సరే, ఆగమ్మా, ఈ రోజు ఉదయం రాజభవనం వెలుపల అలాంటి పిల్లవాడు ఒకడు కనిపించాడు, అతను మీ బిడ్డ కావచ్చు, నేను అతనిని తీసుకువస్తాను". ఇలా చెప్పిన తరువాత, బీర్బల్ వెలుపల సైనికుడి వద్ద వదిలి పెట్టిన బిడ్డను తీసుకువచ్చి, ఆ స్త్రీకి చూపించాడు. ఆ స్త్రీ తక్షణమే బీర్బల్ చేతిలో నుండి బిడ్డను లాక్కొని, "ఆ, వీడే నా ముద్దుల బిడ్డ, నా బంగారుకొండ", అని ఆ పిల్లవాడిని ముద్దుపెట్టుకుంటూ చెప్పింది. అక్బర్ కి ఈ విషయం పూర్తిగా ఏమీ అర్థంకాకుండా ఉంది. బిడ్డను ఆ స్త్రీకి అప్పగించి, నిశ్శబ్దంగా బీర్బల్ తో కలిసి రాజభవనానికి బయలుదేరాడు. దారిలో బీర్బల్ ని – "ఇదంతా ఏమిటి?" అని అడిగాడు. బీర్బల్ నవ్వుతూ – "ఇదంతా చాలా సూటిగా, స్పష్టంగా ఉంది కదా జహాపనా? ప్రతీ తల్లిదండ్రులకు తమ బిడ్డ ఉత్తమంగానే కనపడుతుంది. కాబట్టి మీరు సలీం విషయంలో చెబుతున్న దానిలో కొత్తేమీ లేదు." అక్బర్ ఇప్పుడు పూర్తిగా అర్థం చేసుకున్నాడు. అతను బీర్బల్ వీపు తడుముతూ ఇలా అన్నాడు – "మీరు నిజంగా నా కళ్ళు తెరిపించారు. నేను సలీంని చూస్తుంటే ఒక తండ్రి హృదయం తప్పకుండా అతని మిరుమిట్లుగొలిపే అందాన్ని రెట్టింపు చేస్తుంది." మన స్వంత విషయాలు, మన వస్తువులు లేదా మన ప్రియమైన వారి గురించి ఏదైనా అభిప్రాయాన్ని వ్యక్తపరిచేటప్పుడు, మనం మన నిష్పక్షపాత వైఖరిని ఒకసారి చూసుకోవాలి. మన మొండితనం లేదా పక్షపాతం ఏదైనా విషయంలో మన దృక్కోణాన్ని ఎక్కువచేసి చెప్తోందా అన్నది మనమే పరీక్షించుకోవాలి. అప్పుడు ఆ అభిప్రాయం మన పిల్లల గురించి అయినా, మన విద్య గురించి అయినా, మన మతం గురించి అయినాబీ తేడా ఏమీలేదు. సత్యం ఎల్లప్పుడూ, ప్రతీ పరిస్థితిలో, సత్యమే అయ్యిఉంటుంది... దానిని చూడడానికి, అర్థం చేసుకోవడానికి నిష్పాక్షికమైన దృష్టి ఉండటమే అవసరం, ఎందుకంటే వివేకం, నిష్పాక్షికమైన దృష్టి మాత్రమే సత్యాన్ని చూడగలవు. కాబట్టి, మనం వస్తువులను, వ్యక్తులను నిష్పాక్షికంగా చూడగలిగితే తప్ప, మన జీవితానికి ఎటువంటి సత్ఫలితం ఉండదు.

"మెదడు లేదా మేధస్సు అనేది సమాచారం, విమర్శించగల ఒక కంప్యూటర్ మాత్రమే. కానీ విషయాల యొక్క స్పష్టత, హృదయం ద్వారా మాత్రమే పరీక్షించబడుతుంది.

హార్ట్ ఫుల్ నెస్ అనేది ఒక అవగాహన
ప్రేమ, ఆప్యాయతలతో కూడిన అవగాహన
దాజీజి
హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం
అనువాదబృందం ఆంధ్రప్రదేశ్

# నిజమైన వికలాంగులు ఎవరు?

### - మనో బంధు పెన్ పవర్ కృష్ణారెడ్డి








**కడప పెన్ పవర్ ఆగష్టు 16 :** వికలాంగులు... క్లాస్‌లో పూరన్ సింగ్ అనే కొత్త విద్యార్థి చేరాడు. అతడు కుంటుతూ నడవడం చూసి పిల్లలు నవ్వడం మొదలు పెట్టారు. వారు అతని వైకల్యాన్ని ఎగతాళి చేస్తూ మిస్టర్ క్రిపిల్ సన్ వంటి పేర్లతో పిలిచారు.. ఇంకొకరు–"వావ్, అతని పేరు పూరన్ సింగ్, కానీ పాపం అసంపూ ర్ణుడు." (పూరన్ అంటే పూర్ణుడు) టీచర్ రాక ముందే, తరగతిలో ఉన్న విద్యా ర్థులు అతనిని ఎగతాళి చేయ డంలో ఎటువంటి అవకాశాన్ని వదిలిపెట్టలేదు. టీచర్ క్లాస్ లోకి ప్రవేశించడంతోనే, తన విధిని నిర్వర్తిస్తునట్లుగా, పూరన్ సింగ్ ను పరిచయం చేస్తూ, ఆ విద్యార్థి పట్ల సానుభూతి చూపమని తరగతికి విజ్ఞప్తి చేశాడు. "చూడండి పిల్లలూ, పూరన్ మన క్లాసులో కొత్త విద్యార్థి. మీలాగా మాములుగా లేడని అతనిని ఆటపట్టించకండి, బదులుగా మీ చేతనైనంత సహాయం చేయండి." "అయ్యో, పాపం" పక్కనే కూర్చున్న కొంటె విరాట్ వ్యంగ్యంగా అన్నాడు. ఇది పూరన్ కి నచ్చలేదు. అతను వెంటనే, "నేను పేదవాడిని కాదు, ఎవరి దయ నాకవసరం లేదు, నేను కేవలం ఒక కాలుతో వికలాంగుడిని, కానీ మానసికంగా కాదు. నా వైకల్యం నా పనికి ఆటంకం కలిగించదు, నా పనులన్నీ నేనే చేసుకోగలను." అని చెప్పాడు. పూరన్ సింగ్ మాటలు టీచర్ గుండెల్లో గుచ్చుకున్నాయి. అతను శాంతంగా, "నా మాటలు అపార్థం చేసుకోవద్దు, నేను నిన్ను క్లాసులోకి సాదరంగా ఆహ్వానించడాని కోసమే చెప్పాను", ఒక క్షణం తర్వాత, "నిజానికి, మనమందరం వికలాంగులమే. నేటి ప్రపంచం అంతా వికలాంగుల ప్రపంచం." అని అన్నాడు. విద్యార్థుల్లో ఒకరైన స్పర్శ్ కు ఇది నచ్చలేదు. అతను లేచి నిలబడి తన అభ్యంతరాన్ని తెలియజేశాడు, "క్షమించండి సార్! మన అవయవాలన్నీ సురక్షితంగా పని చేస్తున్నప్పుడు, మనం వికలాంగులం ఎలా అవుతాం?" అని అడిగాడు. "నేను వివరిస్తాను. నేను చెప్పేదానిని విస్తృత కోణంలో తీసుకోండి. మనం ప్రతీ విషయంలోనూ ఇతరుల సహాయం కోరుకుంటాం. చూడండి, పిల్లలు, ఇతరులతో చెడుగా ప్రవర్తించే వారు వికలాంగులు, ఎందుకంటే వారు దయా గుణం అనే ముఖ్యమైన 'అవయవాన్ని' కోల్పోయుంటారు కాబట్టి." క్లాస్ టీచర్ ఈ మాటలతో విద్యార్థులు ఏకీభవించలేదు. పార్థివ్ లేచి నిలబడి, "నేను ఎవరితోనూ తప్పుగా ప్రవర్తించలేదు, కనుక నేను వికలాంగుడిని కాను", అన్నాడు. "మొదట నేను చెప్పేది మొత్తం విను", అంటూ టీచర్ పార్థివ్ ని కూర్చోబెట్టాడు. "ఏ కారణం లేకుండా ఇతరులను వేధించే వారు, వేరొకరి హక్కులను హరించే వారు కూడా నిజానికి వికలాంగులే." " నేను ఎవరినీ వేధించను, ఎవరి హక్కులను హరించను అంటే నేను వికలాంగురాలిని కాను అని అర్థం", అని విదిత చెప్పింది. "నేను ఇంకా మాట్లాడటం పూర్తి చేయలేదు, తప్పుడు ప్రసంగాలు చేసేవారు, అబద్ధాలు చెప్పేవారు, ఎవరి మాటలు వారి చర్యలతో ఏకీభవించవో వారు కూడా వికలాంగులే", అంటూ క్లాస్ టీచర్ కొనసాగించాడు. " నేనైతే అలాంటి వాడిని కాదు" అని జతిన్ నిరసన వ్యక్తం చేశాడు. "ఇదొక్కటే కాదు, ఇతరులు బాధపడుతుంటే, చూసి సంతోషించే వారు లేదా వారికి బాధ కలిగించడం ద్వారా ఆనందించే వారు కూడా వికలాంగులు అవుతారు" అని టీచర్ చెప్పాడు. "సార్! మీ చెప్పేదాంట్లో అందరినీ కలుపుతున్నారు, నెమ్మదిగా ఒకరి తర్వాత ఒకరిని," సార్థక్ అడ్డుకోవడానికి ప్రయత్నించాడు. అతణ్ని పట్టించుకోకుండా టీచర్ మాట్లాడుతూ , "ఎదుటి వారికి అన్యాయం జరుగుతుంటే చూసి మౌనంగా ఉండేవారు కూడా వికలాంగులే... ఎందుకంటే వారు తమ మానవ కర్తవ్యాన్ని మరచిపోయారు గనుక, దాని ప్రకారం, అన్యాయాన్ని చూస్తూ విస్మరించే వారు కూడా నేరస్థులే కదా." "అయితే సార్! ఇదీ.." అంటూ మోహన్ ఏదో చెప్పాలనుకున్నప్పుడు టీచర్ అడ్డుపడి, "విశాల దృక్పథం లో తీసుకోమని చెప్పాను కదా. మన ముందు అవినీతి పనులు జరగడం చూస్తుంటాం కానీ, దానికి వ్యతి రేకంగా గొంతు ఎత్తే సాహసం చేయడం లేదు. ఇది మన మానసిక వైకల్యాన్ని చూపడం లేదా?" అని ప్రశ్నించారు. " కాబట్టి, దీని అర్థం చెడు లక్షణాలు ఉన్న వ్యక్తి, లేదా తన విధిని నిర్వర్తించని వ్యక్తి కూడా వికలాంగుడేనా?" విరాట్ తెలుసుకోవాల నుకుని అడిగాడు. "అందుకే నేను చెప్పాను, మనమందరం వికలాంగులం, ఎందుకంటే మనమందరం కూడా ఏదో ఒక లోపంతో బాధపడుతున్నాం. ఒక సామాన్య లక్షణం లేకపోవటం, లేదా ఆ లక్షణం కలిగి ఉన్నప్పటికీ సరైన సందర్భంలో ఉపయోగించకపోవడం కూడా ఒక వైకల్యమే, " అని టీచర్ బదులిచ్చాడు. "సార్," సౌమ్య ఏదో చెప్పాలనుకుంది, కానీ టీచర్ ఆమెను మాట్లాడనివ్వకుండా – "శరీర భాగం దెబ్బతిన్నవాడిని శారీరక వికలాంగుడు అంటారు, కానీ మంచి ప్రవర్తన లేనివారిని మానసిక వికలాంగులు అంటారు!" అన్నాడు టీచర్ దృఢంగా, గంభీరంగా. "సార్, మీకు అభ్యంతరం లేకపోతే, నేను ఒక విషయం అడగనా? మీరు ఇచ్చిన వివరణ ప్రకారం, మీరు కూడా వికలాంగులేగా?" అని విరాట్ ప్రశ్నించాడు. టీచర్ ఒక్కక్షణం అశాంతిగా కదులుతూ, "అవును నేను మాత్రం సమాజానికి దూరంగా ఎలా బ్రతకగలను" అని నిశ్చింతగా అన్నాడు. మీ దృష్టిలో నేను టీచర్నే కానీ నాకు కూడా కొన్ని పరిమితులు ఉన్నాయి. అంటే ఏ వ్యక్తి అయినా, ఏ కారణం చేతనైనా, తన కర్తవ్యాన్ని లేదా సామర్థ్యాన్ని నిర్వర్తించలేకపోతే, అతన్ని వికలాంగుడు అంటారు. "సార్! ఇంతకు ముందు మానసిక వికలాంగులు అంటే పిచ్చివారని అనుకున్నాం" విశేష్ చెప్పాడు. " అది దాని సంకుచిత అర్థంబీ విస్తృత కోణంలో, తమ విధిని పాటించని వారందరినీ వికలాంగుల వర్గంలో చేర్చవచ్చు." విద్యార్థుల ముఖాల్లో ఆ విషయంలోని గంభీరత, గాఢత కనిపించింది. టీచర్, "ఇప్పుడు ఎవరైనా నాతో ఏకీభవించనట్లయితే, చేయి పైకెత్తవచ్చు" అని అడిగారు. ఆ రోజు క్లాస్ లో పుస్తకాలు తెరవలేదు కానీ, పిల్లలు జీవితంలోని ముఖ్యమైన పాఠాన్ని నేర్చుకున్నారు! మనం పరిపూర్ణత వైపు కదులుతున్నాం. దేనిలో పరిపూర్ణత? బాహ్య రూపంలో, అభిరుచిలో, ఇతర విషయాలలో కాదు. ఈ పరిపూర్ణత అనేది మన అంతర్గత సమతుల్యతలో, మనలోని దోషరహిత స్వభావంలో, మన ప్రవర్తనలో ఉండాలి.

దాజీజి
హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం
అనువాదబృందం ఆంధ్రప్రదేశ్

# ఆర్యవైశ్య యువజన సంఘంలో కృష్ణాష్టమి వేడుకలు





**విశాఖ దక్షిణం పెన్ పవర్ ఆగస్టు 16 :**విశాఖపట్నం వన్టౌన్ ప్రాంతంలోగల ఆర్యవైశ్య యువజన సంఘంలో నిర్వహిస్తున్న శ్రావణమా సం సంబరాల్లో భాగంగా కృష్ణాష్టమి సంద ర్భంగా 16వ తేది శనివారం నాడు 12 సంవత్స రాల లోపు బాల బాలికలచే కృష్ణాష్టమి వేడుక లు ఘనంగా నిర్వహించారు శ్రావణమాసం సందర్భంగా మహిళలచే నిర్వహించబడుతున్న కార్య క్రమాల్లో భాగంగా కృష్ణాష్టమి వేడుకలు ముద్దులొలుకు గోపికలతో అల్లరి కృష్ణయ్య అనే ఉపశీర్షికతో నిర్వ హించారు కార్యక్రమంలో చిన్నారులచే ఉట్టి కొట్టించటం చిన్నికృష్ణుడు, రాధ,గోపికలు వేషధారణ పోటీలు,చిన్నారి కృష్ణుల చిలిపి పనులు వంటి కార్యక్రమాలు ఉత్సాహ భరితంగా నిర్వహించారు సుమారు 30 మంది చిన్నారులు పాల్గొన్న ఈ కార్యక్రమం ఆద్యంతం ఉత్సా హంగా ఆనందంగా సాగింది ఈ సందర్భంగా మహీళా విభాగం అధ్యక్షురాలు మరియు కార్యక్రమ నిర్వహణ కమిటీ చైర్మన్ పర్సన్ శ్రీమతి దుర్గా శాంతి, కో చైర్ పర్సన్ శ్రీమతి లత మరియు మహిళా విభాగ సహాయ కార్యదర్శి శ్రీమతి వంకాయల సృజన, కార్య క్రమ హెూస్ట్ శ్రీమతి లీల మాట్లాడుతూ చిన్నారుల్లో దేవునిపట్ల భక్తి భావం, కృష్ణతత్వం మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల విశ్వాసం ఫరిడవిల్లేలా వారికి అర్థ మయ్యే రీతిలో శ్రీకృష్ణుని ఆటపాటలు గీతాలతో వివ రించినట్లు తెలిపారు కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవ హరించిన పుష్ప లత చిన్నారు లను ఉత్సాహ భరితంగా ఉంచేందుకు చిన్నారులకు కృష్ణుని పట్ల అవగాహన కలిగించేందుకు చిన్ని కృష్ణునికి సంబంధించిన విషయాలను వారికి వివరిస్తూ ఉత్తేజ పరిచారు ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ చిన్నారుల్లో కృష్ణ తత్వం,భక్తి భావం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా అవసరమని అన్నారు

కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులందరికీ బహు మతులు జ్ఞాపికలు అంద జేశారు కార్యక్రమానికి విచ్చేసిన మహిళల అందరినీ ఉత్తేజ పరచడా నికి కొబ్బరి చిప్పలతో క్రాఫ్ట్ అనే వినూత్న కార్యక్రమం నిర్వహించి మహి ళలలో ఉన్న కళాత్మకతను సృజనాత్మకతను బయటకి తీసే విధంగా కొబ్బరి చిప్ప లను అత్యంత సుందరం గా ఆకర్షణీయంగా అలంక రించడం కార్యక్రమా నికి హైలైట్ గా నిలిచింది ఉత్తమ కళాకృతుల ను చేసిన వారికి బహుమతులు ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్రీయుతులు నేతి శ్రీనివాసరావు,కట్టమూరి సూర్యనారాయణ, కోశాధి కారి దుర్గా నూకేశ్వర రావు, సంఘం మాజీ అధ్యక్షులు దుర్గా సోమేశ్వర రావు మరియు చిన్ని రాధాకృష్ణుల తల్లిదండ్రులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 218 మంది పిల్లలకు నోటు పుస్తకాలు, పలకలు ఉచితంగా పంపిణీ





- చదువుకుంటేనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు.
- విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మారుమూల రంగాబయలు ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి.
- నోటు పుస్తకాలు, పలకలు పంపిణీ చేసిన దాత కొర్ర నీలరావు( రోబో)

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 16.**అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండలంలో గల అత్యంత మారుమూల రంగాబయలు పంచాయితీలో అన్ని ప్రభుత్వ పాఠశాలకు చెందిన 218 మంది విద్యార్థిని విద్యార్థులకు వనుగుమ్మ గ్రామానికి చెందిన కొర్ర నీలరావు ( రోబో) ఉచితంగా నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్స్, ఎరేజర్లు, పలకలు పంపిణీ చేశారు. రంగబయలు పంచాయితీలో గల అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కొరకు నీలరావు(రోబో) తన సొంత నిధులు వెచ్చించి విలువైన సామాగ్రిని శుక్రవారం వితరణ చేశారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వలజంగి 21 మంది, లాంగ్బపోదొర్ 27 మంది, చంపపుట్36, మల్లీ పోదోర్13, రంగ భయాలు23, మట్టిగూడ26, కోసంపుట్టు41, జోడిగుమ్మ31 మంది విద్యార్థులకు గాను అన్ని పాఠశాలలకు చెందిన 218 మందికీ ఉచితంగానే నోట్ బుక్, పెన్నులు, పలకలు పంపిణీ చేశారు. మండలంలో గల వివిధ రహదారి పనులలో నీలరావు(రోబో) సూపర్వైజర్ గా పనిచేస్తుంటారు. ఈ సందర్భంగా అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు కలిసి నీలరావు(రోబో) మాట్లాడుతూ.. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉండాలంటే చదువే ముఖ్యమని, చదువుకునే వయసులో ఎవరు కూడ బడికి దూరంగా ఉండకూడదు అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని, ఉన్నత చదువులు చదివి మారుమూల ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. విద్య పట్ల పిల్లలకు ఆసక్తి కలుగునట్లు చిన్న తోడ్పాటు మాత్రమే అందించానని, ఈ విధంగా పిల్లలతో మమేకమవడం



ఆనందంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు నీలరావు (రోబో)ను ఘనంగా సత్కరించారు. విద్యార్థులు విద్యాభ్యాసానికి కావలసిన తోడ్పాటు అందించినందుకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు రోబోకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మార్వాడి కుటుంబానికి అండగా వాసుపల్లి



**వైద్య ఖర్చులకు రూ. 5000 సాయం.**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 16 :**దక్షిణ నియోజకవర్గంలో 38వ వార్డు కు చెందిన మార్వాడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే చేయూతనందించారు. మలి సుభద్ర వైద్య ఖర్చులకు రూ. 5000 అందించారులి. దక్షిణ వైఎస్ఆర్సిపి నేతలతో కలిసి ఇంటికి వెళ్లి పరామర్శించారు. గత కొద్దికాలంగా ఆమె కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించు కుంటున్నారు. అసలే ఆర్థిక ఇబ్బందులతో ఉన్న మార్వాడి పేద కుటుంబానికి వైద్య ఖర్చులకు సాయం చేయడంతో పాటు ప్రతి నెల ఆసుపత్రికి వెళ్లేందుకు రవాణా ఖర్చులు కూడా ఆర్థిక సహాయం అందిస్తానని వాసుపల్లి హామీ ఇచ్చారు. రోగి భర్త జాలేందర్ బంగారు షాపులో హెల్పర్ గా చిన్న ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారులి. భార్యకు కిడ్నీ వ్యాధి మందుల ఖర్చులకు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో వాసుపల్లిని కలిసి వారి సమస్యను విన్నవించు కున్నారు. వారి పేదరికం చూసి చలించిన పేదల పెన్నిధి ఆపద్బాంధవుడు వాసుపల్లి గణేష్ కుమార్ ఆ మార్వాడి పేద కుటుంబాన్ని ఆదుకున్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బి సి సెల్ అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్,సౌత్ ఎస్. సి. సెల్ ప్రెసిడెంట్ ఆకుల శ్యామ్, 38 వ వార్డ్ అధ్యక్షు లు గురజాపు రవి, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు చేపల నూకరాజు, అర్జున్ ప్రసాద్, కోసూరి కిరణ్, అనేమోల్, అయ్యప్ప, అమర దేవి, రాము పెదగాడ బాబ్జి, కదిరి మహేష్ కదిరి పెద్ద, చేపల ప్రసాద్ చేపల రాజు, చిన్నికృష్ణ, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటకులతో కిటా కిటా లాడినా చాపరాయి జలవిహారి

**వర్షాలతో మూత బడడం నిరాశతో రహదారి నుండే వెను దిరిగిన పర్యాటకులు**







**దుంబ్రిగుడ,పెన్ పవర్,ఆగష్టు,16:-** మండల కేంద్రంలో గల ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలవిహారి లో శనివారం పర్యాటకులతో కిటకిట లాడింది.మూడు రోజులు సెలవులు రావటంతో పర్యాటకులతో కిటకిట లాడింది.అయితే గత మూడు రోజులు నుండి వర్షాలు అని ఐ టి డి ఎ ప్రాజెక్ట్ అధికారి ఆదేశాల మేరకు ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకు మూడు రోజులు మూత బడింది.చాపరాయి జలపాతం వచ్చిన పర్యాటకులు మూత బడడంతో నిరాశతో రహదారి నుండే వెళ్ళిపోయారు.

# విశాఖ తూర్పులో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



















# వైసీపీ వార్నింగులు. ఎవరూ పట్టించుకోవట్లేదా ..!



**హైదరాబాద్ పెన్ పవర్:**రాజకీయాల్లో ఉన్న నాయకులు విమర్శలు, ప్రతివిమర్శలు చేయడం తప్పుకాదు. కానీ, లెక్క పత్రం లే కుండా... చేసే విమర్శలను ఎవరూ హర్షించరు. పైగా.. బలమైన కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు మరింత ఆలోచించుకుని వ్యవహరించాలి. ఒక మాట అంటే.. నాలుగు మాటలు ఎదురు వచ్చే పరిస్థితి వైసీపీకి ఎదురవుతోంది. ఈ విషయాన్ని నాయకులు లైట్ తీసుకుంటున్నారో.. లేక.. ఏం జరుగు తోందో తెలియదు కానీ, వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలు గాలి వాటంగా ఉన్నాయన్న విమర్శలు వస్తు న్నాయి.పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలకు సంబంధించి మాజీ మంత్రి అంబటి చేసిన వ్యాఖ్య లు బూమరాంగ్ అయ్యాయి. ఎక్కడో వేరే రాష్ట్రంలో జరిగిన ఎన్నికల రిగ్గింగ్ దృశ్యాలను ఇక్కడ జరిగినట్టు గా ఆయన పోస్టు చేయడం.. వాటికి వ్యాఖ్యానాలు కూడా జోడించడం.. పార్టీని అభాసుపాల్జేసింది. ఈ పరి ణామాలపై పార్టీ అంతర్మథనం చెందే పరిస్థితి వచ్చింది. కానీ.. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయిం ది. ఈ ఒక్కటే కాదు.. ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించకుండానే.. ఈ పథకం ఫెయిల్ అయిందంటూ .. వైసీపీ సోషల్ మీడియాలో ప్రచారం చేశారు.కానీ, సీఎం చంద్రబాబు స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించిన తర్వాత.. మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. దీంతో వైసీపీ నేతలు అప్పటి వరకు చేసిన విమర్శలు గాలికి కొట్టుకుపోయాయి. నిజానికి ఏదైనా పథకంపై విమర్శలు చేయాలని అనుకున్నప్పుడు ఖచ్చితమైన లెక్కలు వేసుకుని ముందుకు సాగాలి. ఆధారాలతో ముందుకు రావాలి. లేకపోతే.. ఏ పార్టీకైనా ఇబ్బందులు తప్పవు. అసలే వైసీపీపై ఇంకా ఇంకా వ్యతిరేకత ను పెంచే క్రమంలో కూటమి ప్రభుత్వం దూకుడుగా ముందుకుసాగుతోంది. 11 సీట్లే వచ్చాయి కదా.. అని వైసీపీని వదిలి పెట్టడం లేదు.ఈ నేపథ్యంలో వైసీపీ వేసే ప్రతి అడుగూ కీలకంగా మారాల్సిన అవసరం ఉందని సీనియర్లు చెబుతున్నా రు. ఏదో మీడియా ముందుకువ చ్చి అన్నామంటే అన్నాం అన్నట్టుగా విమర్శలు చేస్తే.. ప్రయోజనం ఉండకపోగా.. పార్టీకి మరింత చేటు వస్తుందని కూడా చెబుతున్నారు. పార్టీ అధినేత జగన్ సైతం.. ఎలాంటి ఆధారాలు లేకుండా చేస్తున్న విమర్శలను ఈ సందర్భంగా పలువురు గుర్తు చేస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఇటీవల వర్షాలకు పొలాల్లోకి నీరు చేసింది. ఆ వెంటనే కలెక్టర్‌రైతులకు పరిహారం ఇచ్చేశారు. మరి ఈవిషయం తెలిసో.. తెలియకో జగన్ విమర్శలు చేశారు. కానీ, అవి విఫలమయ్యాయి. ఇలా.. వైసీపీ చేస్తున్న పనులు ఆ పార్టీకి ఎదురు తిరుగుతున్నాయన్న చర్చ జోరుగా సాగుతుండడం గమనార్హం.

# భారత్ పై ట్రంప్ పగటి కలలు ఎప్పటికీ నెరవేరవు



**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత్, రష్యా దేశాల మధ్య చమురు వ్యాపారంపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. రష్యాకు పెద్ద కొనుగోలుదారు అయిన భారత్ ఆ దేశానికి దూరమైందని ట్రంప్ పేర్కొన్నారు. కానీ, గణాంకాలు మాత్రం దీనికి విరుద్ధంగా ఉన్నాయి. జాతీయ ప్రయోజనాల ఆధారంగా భారత్ తన విధానాలను రూపొందించుకుంటుందనే వాస్తవాన్ని ఈ వ్యాఖ్యలు విస్మరించాయి.

**ట్రంప్ వ్యాఖ్యలు**

ట్రంప్ తన ఒక ఇంటర్వ్యూలో "భారత్ రష్యాకు పెద్ద మద్దతుదారు కాదు, రష్యా తన అతిపెద్ద వినియోగదారుని కోల్పోయింది" అని వ్యాఖ్యానించారు. పుతిన్‌తో జరగబోయే శిఖరాగ్ర సమావేశానికి ముందు ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అంతేకాకుండా, అవసరమైతే "సెకండరీ టారిఫ్‌లు" విధించడానికి వెనుకాడబోనని, అది "వినాశకరమైన" నిర్ణయం అయినప్పటికీ అమెరికా ప్రయోజనాల కోసం అమలు చేస్తామని హెచ్చరించారు.

**వాస్తవాలు**

ట్రంప్ వ్యాఖ్యలకు విరుద్ధంగా, భారత్ రష్యా నుండి చమురు కొనుగోలును తగ్గించలేదు. కెప్లెర్ నివేదికల ప్రకారం, జూలైలో భారత్ రోజుకు 16 లక్షల బ్యారెళ్ల చమురు కొనుగోలు చేయగా, ఆగస్టులో అది 20 లక్షల బ్యారెళ్లకు పెరిగింది. ఇది భారత్ తన జాతీయ ప్రయోజనాల ఆధారంగా వ్యవహరిస్తుందనే వాస్తవాన్ని స్పష్టం చేస్తుంది. రష్యా నుండి చమురు కొనుగోలు చేయడం భారత్‌కు ఆర్థికంగా లాభదాయకం. అంతేకాక, చమురు సరఫరాదారుల జాబితాలో అమెరికా ఐదవ స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో, ట్రంప్ మాటలు వాస్తవాలకు పూర్తి భిన్నంగా కనిపిస్తున్నాయి.

**- అంతర్జాతీయ సంబంధాలు, జాతీయ ప్రయోజనాలు**

ప్రతి దేశం తన జాతీయ ప్రయోజనాల ఆధారంగా విదేశాంగ విధానాన్ని రూపొందించుకుంటుంది. ముఖ్యంగా అంతర్జాతీయంగా చోటు చేసుకునే పరిణామాలు, యుద్ధాలు, ఆర్థిక పరిస్థితులు ఆయా దేశాల నిర్ణయాలపై ప్రభావం చూపుతాయి. ఈ విషయంలో భారత్ కూడా అదే చేసింది. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా నుండి రాయితీ ధరల వద్ద చమురు లభించడం భారత్‌కు ఒక గొప్ప అవకాశం. ఇది భారత్ తన ఇంధన భద్రతను బలోపేతం చేసుకోవడానికి, ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి సహాయపడుతుంది.

**భవిష్యత్తు సవాళ్లు**

ట్రంప్ "సెకండరీ టారిఫ్‌లు" విధించే హెచ్చరిక ఒక తీవ్రమైన సవాల్. అయినప్పటికీ, అంతర్జాతీయ చట్టాలు, వాణిజ్య ఒప్పందాలను పరిగణనలోకి తీసుకుంటే అటువంటి చర్యలు అంత తేలిక కాదు. ఒకవేళ అమెరికా ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే అది ప్రపంచ వాణిజ్య వ్యవస్థపై, ముఖ్యంగా అమెరికా ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంది. ప్రపంచ వాణిజ్య సంస్థ (%ఔటూ%) వంటి సంస్థలు ఇటువంటి ఏకపక్ష నిర్ణయాలను తీవ్రంగా ఖండిస్తాయి.డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు అతని రాజకీయ ఆలోచనలకు, అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా ఉండవచ్చు. కానీ అవి వాస్తవాలను, గణాంకాలను ప్రతిబింబించడం లేదు. భారత్ వంటి దేశాలు కేవలం ఇతర దేశాల ఒత్తిళ్లకు తలొగ్గకుండా తమ జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూ నిర్ణయాలు తీసుకుంటాయనేది స్పష్టం. కాబట్టి, భారత్‌పై ట్రంప్ చూస్తున్న 'పగటి కలలు' ఎప్పటికీ నెరవేరవు.

# అమ్మతనం అంగడి సరుకు చేస్తున్నారా?

**హైదరాబాద్ పెన్ పవర్:**సంతానం పొందాలనేది ప్రతీ దంపతుల కల.. తమ ఒడిలో పిల్లలను ఆడించాలని తహతహలాడుతుంటారు. మారుతున్న జీవిన శైలి.. ఉద్యోగ, వ్యాపార ఒత్తిళ్లు, వాతావరణ పరిస్థితులు, జన్యు లోపాలు, ఇతర అంశాల కారణంగా కొంత మంది దంపతులు సంతానానికి దూరమవుతున్నారు. అయితే ఈ సమస్య ఏటేటా పెరుగుతూ వస్తుండడం ఆందోళన కలిగించే అంశమే. అయితే సంతానం పొందలేని దంపతులు దత్తత మార్గం కాకుండా ఇతర మార్గాల సంతానం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇప్పటి వరకు ఇది విజయవంతమైన ప్రక్రియ అని అంతా భావిస్తూ వచ్చారు. కానీ ఇటీవలి పరిణామాలు విస్మయానికి గురి చేస్తున్నాయి. తమ అనుకున్న సంతానం పరాయి వాళ్లు అని తేలుతుండడం జీర్ణించుకోలేకపోతున్నారు.సికింద్రాబాద్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ఘటన మరువకముందే మేడ్చల్ జిల్లాలో మరో అక్రమ సరోగసీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కమర్షియల్ సరోగసీ, అక్రమ అండాల వ్యాపారం చేస్తున్న ఏడుగురు మహిళలు, ఓ పురుషుడిని పోలీసులు శు క్రవారం అరెస్ట్ చేశారు.పోలీసుల దర్యాప్తులో బయటపడిన వివరాల ప్రకారం, నిందితులు పేదింటి యువతులను లక్ష్యంగా చేసుకుని వారిని సరోగసీ, అండాల దానం చేయడానికి ప్రలోభపెడుతున్నట్లు పోలీసుల విచారణలో వెలుగు చూసింది. . వారికి కేవలం నాలుగు నుంచి ఐదు లక్షల రూపాయలు మాత్రమే ఇచ్చి, సరోగసీ ద్వారా పిల్లలు కనిపించుకునే తల్లిదండ్రుల నుంచి మాత్రం రూ. 20 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తేలింది. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితురాలు నర్రెద్దుల లక్ష్మిరెడ్డి అలియాస్ లక్ష్మి (45), ఆమె కుమారుడు నరేందర్ రెడ్డి (23) కీలకంగా వ్యవహరిస్తున్నారని పోలీసులు తెలిపారు.



**జైలు శిక్ష పడినా మారని తీరు..**

లక్ష్మి గతంలో ముంబైలో పిల్లల అమ్మకం, అక్రమ సరోగసీ కేసులో అరెస్టయి జైలు కెళ్లారు. నేరం రుజువు కావడంతో జైలు శిక్ష కూడా అనుభవించారు. జైలు నుంచి వచ్చిన తర్వాత కూడా తన వైఖరి మార్చుకోకుండా మళ్లీ అదే తరహా నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన తర్వాత తన కుమారుడు, కూతురుతో కలిసి పాత పద్ధతిలోనే ఈ దందాను కొనసాగించినట్లు దర్యాప్తులో బయటపడింది.

**ఏజెంట్ల ద్వారా వివరాలు..**

సోదాల్లో లక్ష్మి ఇంటి నుంచి ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్లు, గర్భధారణ మందులు, హార్మోన్ ఇంజక్షన్లు పెద్దఎత్తున స్వాధీనం చేశారు. అదనంగా, పలు ఐవీఎఫ్ సెంటర్లను ఆశ్రయించిన దంపతుల వివరాలను ఏజెంట్ల ద్వారా సేకరించిన ఆధారాలు కూడా లభించాయి.

**ఆ వైద్యశాలలతో సంబంధాలు..**

లక్ష్మి హెగ్డే హాస్పిటల్‌తో పాటు అను టెస్ట్ ట్యూబ్ సెంటర్, ఈవీఎఫ్ ఐవీఎఫ్, ఫర్టి కేర్, శ్రీ ఫెర్టిలిటీ, అమూల్య ఫెర్టిలిటీ సెంటర్లతో సంబంధాలు కొనసాగించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వైద్యశాలలతో ఉన్న అనుబంధాలపై లోతుగా విచారణ చేపట్టాలని అధికారులు నిర్ణయించారు.

**చీకటి కోణాలపై మరింత దర్యాపు..**

ఇలాంటి అక్రమ సరోగసీ నెట్‌వర్క్‌లు పేద మహిళలను వలలో వేసుకుని తమ ప్రయోజనాల కోసం దోపిడీ చేస్తున్నాయని పోలీ సులు పేర్కొంటున్నారు. ఈ కేసు వెనుక మరెన్ని చీకటి కోణాలు ఉన్నాయో అనే అనే దానిపైనా దర్యాప్తు సాగుతోంది.

# మహిళా పొలిటీషన్స్ కు 'ఆ రోజులు' పెద్ద సవాల్ : కంగనా రనౌత్

**హైదరాబాద్ పెన్ పవర్:**స్టార్ హీరోయిన్ బాలీవుడ్ ను ఏలిన కంగనా రనౌత్ రాజకీయాల్లోనూ రాణిస్తున్నారు. రాజకీయాల్లోకి వచ్చిన తొలి ఎన్నికల్లో ఎంపీగా గెలిచి తన సత్తా చాటారు బాలీవుడ్ క్వీన్ కంగనా. సినిమాల్లోనే కాదు నిజ జీవితంలోనూ సవాళ్లు ఎదుర్కొవడానికి సిద్ధపడుతుంటారు. ఇక తను చేసే వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారుతుంటాయి. సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలుస్తుంటారు కంగనా. మహిళా సాధికారత, సామాజిక అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించే విషయం ఏ మాత్ర వెనుకాడరు. తాజాగా మహిళలు ఎదుర్కొనే ఒక సున్నితమైన సమస్యపై స్పందించారు కంగనా.

ఢిల్లీలో జరిగిన ఒక ఇంటర్వ్యూలో ఆమె రాజకీయ జీవితం, వ్యక్తిగత అనుభవాల గురించి వెల్లడించారు. మహిళలు పీరియడ్స్ సమయంలో పరిశుభ్రత కాపాడుకోవడం, ముఖ్యంగా దీర్ఘకాల ప్రయాణాలు చేసే రాజకీయ నాయకురాలిగా ఉంటే ఎంత కష్టమో వివరించారు.



**"రాజకీయాల్లో లగ్జరీలు లేవు"**

"నటిగా ఉన్నప్పుడు షూటింగ్‌లో పూర్తి సౌకర్యాలు ఉండేవని చెప్పుకొచ్చారు. కారవ్యాన్లు, స్నానం చేసే సదుపాయాలు, కావలసినంత సౌలభ్యం ఉంటుందని వెల్లడించారు. కానీ రాజకీయ పర్యటనల్లో రోజుకు 12 గంటలకు పైగా బస్సుల్లో, రోడ్ల మీద ప్రయాణించాల్సి ఉంటుందని, మధ్యలో మరుగుదొడ్లు కూడా లభించవంటూ ఇబ్బందుల గురించి చెప్పుకొచ్చారు. ఇది తన సమస్య మాత్రమే కాదని, ఇతర మహిళా ఎంపీలకు కూడా పెద్ద సమస్యే" అని ఆమె చెప్పుకొచ్చారు.

**సంప్రదాయాలపై వ్యక్తిగత అనుభవం**

మహిళలు పీరియడ్స్ సమయంలో ఆలయాల్లోకి, వంటగదిలోకి వెళ్లరాదనే నమ్మకాలపై తన అనుభవాన్ని కూడా పంచుకున్నారు. "చిన్నప్పుడు నేను కూడా ఆ నియమాలు పాటించాను. అయితే నా తల్లి ఎప్పుడూ ఇది విశ్రాంతి తీసుకోవాల్సిన సమయం అని చెప్పేది. ఆ రోజుల్లో నేను చాలా అసహనంగా ఉండేదాన్ని, ఏ పనిపట్ల ఆసక్తి ఉండేది కాదు. అందుకే వంట చేయకపోవడం, పనులు చేయకపోవడం మంచిదే" అని తెలిపారు.

**గ్రామీణ సమాజంలో ఇంకా మూఢనమ్మకాలే**

ఈ సందర్భంగా ఆమె గ్రామీణ ప్రాంతాల్లో పీరియడ్స్ చుట్టూ ఇంకా రహస్య భావజాలం, ఆధ్యాత్మిక అడ్డంకులు కొనసాగుతున్నాయని గమనించారు. "మహిళల శరీరంలో సహజంగా జరిగే ఈ ప్రక్రియను సమాజం అర్థం చేసుకోవాలి. ఈ సమయంలో మహిళలు విశ్రాంతి తీసుకునేలా వాతావరణం కల్పించాలి" అని కంగనా పిలుపునిచ్చారు.

**స్త్రీలు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి..**

మహిళల మాసిక సమస్యలను ఓపెన్‌గా చర్చించడం ద్వారా సమాజం మార్పు దిశగా అడుగులు వేయగలదని కంగనా అభిప్రాయపడ్డారు. ఈ అంశాన్ని పెద్ద ఎత్తున చర్చించేలా అవగాహన కార్యక్రమాలు జరగాలని ఆమె సూచించారు.

# ఈ సంకేతాలుంటే మీ గుండెకు ముప్పే.. ముందుగా మేలుకోండి



**హైదరాబాద్ పెన్ పవర్:**మన శరీరం లోపల ఏదైనా సమస్య ఉన్నప్పుడు అది బయటికి కొన్ని సూచనల రూపంలో సంకేతాలు ఇస్తుంది. ముఖ్యంగా గుండె ఆరోగ్యం బలహీనమైతే శరీరం ఇచ్చే చిన్న చిన్న మార్పులను నిర్లక్ష్యం చేస్తే పెద్ద ప్రమాదానికి దారితీయవచ్చు. గుండె సరిగా పనిచేయకపోతే రక్తప్రసరణలో ఆటంకాలు కలుగుతాయి. దీని ప్రభావం నేరుగా శ్వాస, అలసట, శరీర కదలికలపై పడుతుంది. వైద్య నిపుణుల సూచనల ప్రకారం గుండె బలహీనంగా ఉన్నప్పుడు కనిపించే కొన్ని ముఖ్య సంకేతాలు ఇవి.

**1. తరచూ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది**

సాధారణ పనులు చేస్తున్నప్పటికీ శ్వాస ఆడకపోవడం, మెట్లు ఎక్కినప్పుడు లేదా నడిచినప్పుడు గాలి ఆడకపోవడం గుండె బలహీనత సంకేతం కావచ్చు.

**2. చేతులు, కాళ్ల వాపు**

గుండె బలహీనమై రక్తప్రసరణలో అంతరాయం కలిగితే శరీరంలోని ద్రవాలు నిల్వ అవుతాయి. దీంతో కాళ్లు, పాదాలు, చేతులు వాపు వస్తాయి.

**3. తరచూ అలసట**

చిన్న పనులు చేసినా శరీరం బలహీనంగా అనిపించడం, శక్తి తగ్గిపోవడం గుండె సరిగా పని చేయకపోవడానికి సూచన కావచ్చు.

**4. ఛాతిలో బరువు లేదా నొప్పి**

ఛాతీలో బరువుగా అనిపించడం, ఒత్తిడి కలగడం, కొన్నిసార్లు నొప్పి రావడం గుండె సంబంధిత సమస్యలకు సంకేతమని వైద్యులు చెబుతున్నారు.

**5. రాత్రి నిద్రలో ఇబ్బంది**

పడుకునే సమయంలో ఊపిరి ఆడకపోవడం, దగ్గు రావడం, నిద్ర లేచి కూర్చోవాల్సి రావడం గుండె బలహీనతను సూచిస్తుంది.

**6. గుండె వేగం అసాధారణంగా మారడం**

కొన్నిసార్లు గుండె వేగంగా కొట్టుకోవడం, కొన్నిసార్లు నెమ్మదిగా దడపడం వంటి పరిస్థితులు గుండె బలహీనంగా ఉన్నప్పుడు తరచూ కనిపిస్తాయి.

**ఎప్పుడు డాక్టర్‌ను సంప్రదించాలి?**

ఈ లక్షణాలు తరచుగా కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం అవసరం. గుండె బలహీనతను ప్రారంభ దశలో గుర్తిస్తే మందులు, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా పరిస్థితిని నియంత్రించవచ్చు.

**జాగ్రత్తలుజి**

సరైన ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, మితమైన నిద్ర, మానసిక ఒత్తిడిని అధిగమించడం

# రష్యా, చైనా, భారత్ ఒక్కటైతే.. అమెరికాకు ప్రమాదమే..

**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికా మాజీ జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరించిన విదేశీ విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా భారతదేశంపై విధించిన వాణిజ్య సుంకాలు అమెరికాకు వ్యూహాత్మకంగా ఎంత ప్రమాదకరమో ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్ణయాలు రష్యా, చైనా, భారతదేశాలను ఒక కూటమిగా దగ్గర చేస్తాయని, ఇది అమెరికాకు భారీ నష్టం కలిగిస్తుందని ఆయన హెచ్చరించారు.

**-భారత్‌పై సుంకాల వెనుక కారణం**

రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న కారణంగా భారతదేశంపై అమెరికా 25 శాతం అదనపు సుంకం విధించింది. కానీ, రష్యా చమురును భారీగా కొనుగోలు చేస్తున్న చైనాపై మాత్రం ఎలాంటి సుంకాలూ విధించకపోవడంపై బోల్టన్ అన్యాయమని మండిపడ్డారు. ఈ పక్షపాత వైఖరి భారత్‌లో తీవ్ర అసంతృప్తికి కారణమైందని ఆయన వెల్లడించారు.

**-వ్యూహాత్మక ప్రమాదం: మోస్కో, బీజింగ్, ఢిల్లీ**

బోల్టన్ తన వ్యాఖ్యలలో ఒక ముఖ్యమైన విషయాన్ని ప్రస్తావించారు: "మాస్కో, బీజింగ్, ఢిల్లీ ఒక్కటైతే అమెరికాకు వ్యూహాత్మకంగా భారీ నష్టం జరుగుతుంది." భారత్‌పై సుంకాలు విధించడం వల్ల ఈ మూడు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని, ఇది ట్రంప్ ప్రభుత్వం చేసిన అతి పెద్ద పొరపాటని ఆయన అభిప్రాయపడ్డారు. రష్యా, చైనా, భారత్ మధ్య సంబంధాలు ఇప్పటికే అమెరికాకు ఆందోళన కలిగిస్తున్నాయని బోల్టన్ గుర్తు చేశారు. గతంలో పుతిన్ భారత్ పర్యటన, ప్రధాని మోదీ చైనా పర్యటనలు ఈ ఆందోళనలను మరింత పెంచాయని ఆయన పేర్కొన్నారు.

**-భవిష్యత్ సవాళ్లు**

రష్యా అధ్యక్షుడు పుతిన్ త్వరలో భారత్‌ను సందర్శించనుండటం, అదే విధంగా ప్రధాని మోదీ షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశానికి హాజరవుతుండటం వంటి పరిణామాలు అమెరికాకు కొత్త వ్యూహాత్మక సవాళ్లను సృష్టిస్తాయని బోల్టన్ స్పష్టం చేశారు.

ట్రంప్ విధించిన వాణిజ్య సుంకాలు భారతదేశాన్ని అమెరికా నుంచి దూరం చేసి, చైనా-రష్యా వైపు మరింత దగ్గర చేసే అవకాశాలు ఉన్నాయని జాన్ బోల్టన్ గట్టిగా హెచ్చరించారు. ఈ నిర్ణయాలు అమెరికా ప్రపంచ నాయకత్వానికి ప్రమాదకరమని ఆయన అన్నారు.

# పంత్ గాయం ఎఫెక్ట్: క్రికెట్‌లో కొత్త రూల్ తీసుకువచ్చిన బీసీసీఐ

- దేశవాళీ క్రికెట్‌లో బీసీసీఐ సరికొత్త నిబంధన
- తీవ్ర గాయాలైతే ఆటగాడిని మార్చుకునే అవకాశం
- అంతర్జాతీయ క్రికెట్‌లో ఇంకా అమలు కాని నియమం




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్‌లో ఒక ముఖ్యమైన మార్పు చోటుచేసుకోనుంది. ఇటీవల రిషభ్ పంత్ వంటి కీలక ఆటగాళ్లు తీవ్రంగా గాయపడి జట్టుకు దూరమవ్వడంతో, టీమ్‌లు నష్టపోకుండా ఉండేందుకు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ (బీసీసీఐ) ఒక కొత్త నిబంధనను ప్రవేశపెట్టింది. దీనిని 'సీరియస్ ఇంజ్యూరీ రీప్లేస్‌మెంట్'గా పిలుస్తున్నారు. ఈ నియమం 2025-26 దేశవాళీ సీజన్ నుంచి అమల్లోకి రానుంది. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ సిరీస్‌లో భారత ఆటగాడు రిషభ్ పంత్ పాదానికి ఫ్రాక్చర్ కావడం, ఇంగ్లండ్ ఆటగాడు క్రిస్ వోక్స్ భుజం డిస్‌లొకేషన్‌కు గురికావడంతో ఇరు జట్లు 10 మందితోనే ఆడాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితులను నివారించేందుకే ఈ కొత్త రూల్‌ను తీసుకొచ్చారు. ఇప్పటికే కంకషన్ (తల గాయం) కోసం రీప్లేస్‌మెంట్ నిబంధన ఉన్నప్పటికీ, ఇతర తీవ్ర గాయాలకు ఆ అవకాశం లేదు. ఆట మధ్యలో ఎవరైనా ఆటగాడు బంతి తగలడం వల్ల ఎముక విరగడం, తీవ్రమైన కోత లేదా కీలు స్థానభ్రంశం వంటి గాయాలపాలైతే, అతని స్థానంలో సమాన నైపుణ్యం ఉన్న మరో ఆటగాడిని తీసుకునేందుకు ఈ నిబంధన వీలు కల్పిస్తుంది. ఈ రీప్లేస్‌మెంట్‌కు మ్యాచ్ రిఫరీ తప్పనిసరిగా ఆమోదం తెలపాలి. గాయం తీవ్రతను నిర్ధారించడానికి ఆయన వైద్యులు, ఫీల్డ్ అంపైర్లతో చర్చిస్తారు. టాస్ సమయంలో ప్రకటించిన సబ్‌స్టిట్యూట్ జాబితా నుంచే ప్రత్యామ్నాయ ఆటగాడిని ఎంపిక చేసుకోవాలి. ఒకవేళ వికెట్ కీపర్ గాయపడి, జాబితాలో మరో కీపర్ లేకపోతే బయటి నుంచి కూడా అనుమతించే అవకాశం ఉంది. గాయపడిన ఆటగాడికి ఉన్న హెచ్చరికలు లేదా పెనాల్టీ సమయం కొత్తగా వచ్చిన ఆటగాడికి కూడా వర్తిస్తాయి.

**పరిమిత ఓవర్లకు వర్తించదు!**

ఈ కొత్త నిబంధన కేవలం సీకే నాయుడు ట్రోఫీ (అండర్-19)తో పాటు ఇతర మల్టీ-డే డొమెస్టిక్ టోర్నమెంట్‌లకు మాత్రమే వర్తిస్తుంది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీ వంటి పరిమిత ఓవర్ల మ్యాచ్‌లకు గానీ, ఐపీఎల్‌కు గానీ ఇది వర్తించదని బీసీసీఐ స్పష్టం చేసింది. ప్రస్తుతానికి ఈ నిబంధనను ఐసీసీ అంతర్జాతీయ స్థాయిలో అమలు చేయడం లేదు. అయితే, భారత దేశవాళీ క్రికెట్‌లో దీని ఫలితాలను బట్టి భవిష్యత్తులో టెస్ట్ క్రికెట్‌లోనూ ఇలాంటి మార్పులపై చర్చ జరిగే అవకాశం ఉంది.

# పాక్ క్రికెటర్లకు పీసీబీ షాక్.. జీతాల్లో భారీ కోతకు రంగం సిద్ధం

- పేలవ ప్రదర్శనతో పాక్ ఆటగాళ్లపై పీసీబీ ఆగ్రహం
- క్రికెటర్ల సెంట్రల్ కాంట్రాక్టుల్లో మార్పులకు యోచన
- ఐసీసీ ఆదాయంలో 3 శాతం వాటాను తొలగించే అవకాశం
- ఇటీవల వెస్టిండీస్ చేతిలో చరిత్రాత్మక ఓటమి ఎఫెక్ట్
- అన్ని ఫార్మాట్లలోనూ నిరాశపరుస్తున్న పాకిస్థాన్ జట్టు




**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్‌లో పేలవ ప్రదర్శనతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలేలా ఉంది. వరుస ఓటములతో నిరాశపరుస్తున్న బాబర్ అజామ్, మహమ్మద్ రిజ్వాన్ వంటి కీలక ఆటగాళ్ల జీతాల్లో కోత విధించేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఇటీవలే వెస్టిండీస్ చేతిలో వన్డే సిరీస్‌ను ఘోరంగా కోల్పోవడం ఈ అంశానికి మరింత బలాన్నిచ్చింది. ఈ ఏడాది పాకిస్థాన్ ప్రదర్శన అన్ని ఫార్మాట్లలోనూ అత్యంత దారుణంగా ఉంది. ఆడిన 11 వన్డే మ్యాచ్‌లలో కేవలం రెండింటిలో మాత్రమే గెలిచి, మిగతా వాటిలో ఘోరంగా విఫలమైంది. ఇక టీ20ల విషయానికొస్తే, 14 మ్యాచ్‌లకు గానూ ఏడింటిలో గెలిచి, మరో ఏడింటిలో ఓటమి పాలైంది. టెస్టుల్లోనూ ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఒకే ఒక్క విజయాన్ని నమోదు చేసింది. ఈ గణాంకాలు జట్టు ఆటతీరుకు అద్దం పడుతున్నాయి. ఇటీవల వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్ ఓటమి పాకిస్థాన్ క్రికెట్ చరిత్రలోనే ఒక చేదు జ్ఞాపకంగా మిగిలిపోయింది. 1991 తర్వాత విండీస్ చేతిలో పాక్ ద్వైపాక్షిక వన్డే సిరీస్ కోల్పోవడం ఇదే ప్రథమం. చివరి వన్డేలో ఏకంగా 202 పరుగుల భారీ తేడాతో ఓడిపోవడం జట్టును తీవ్రంగా దెబ్బతీసింది.

ఈ నేపథ్యంలో ఆటగాళ్ల సెంట్రల్ కాంట్రాక్టుల నుంచి ఒక కీలక నిబంధనను తొలగించాలని పీసీబీ భావిస్తున్నట్టు 'క్రికెట్ పాకిస్థాన్' నివేదిక వెల్లడించింది. రెండేళ్ల క్రితం సీనియర్ ఆటగాళ్ల ఒత్తిడి మేరకు, అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) నుంచి వచ్చే ఆదాయంలో 3 శాతం వాటాను ఆటగాళ్లకు ఇచ్చేలా పీసీబీ అంగీకరించింది. ప్రస్తుతం ఈ నిబంధనను కాంట్రాక్టుల నుంచి తొలగించాలని బోర్డు నిర్ణయించినట్లు సమాచారం. కొన్ని చట్టపరమైన చిక్కుల వల్ల ఈ ఏర్పాటును వెంటనే రద్దు చేయలేకపోయినా, రాబోయే కొత్త కాంట్రాక్టులలో ఈ నిబంధనను చివరిసారిగా చేర్చి, ఆ తర్వాత పూర్తిగా ఎత్తివేయాలని పీసీబీ యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

# ఆ దెబ్బకు అఫ్రిది నోరు మూశాడు: ఇర్ఫాన్ పఠాన్




**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది నోటి దురుసు ఇప్పుడే కాదు.. అతడు ఆడే రోజుల్లోనూ ఎక్కువే. దాంతో ఇర్ఫాన్ పఠాన్‌కూ ఓసారి చేదు అనుభవం ఎదురైంది. వెంటనే కౌంటర్ ఎటాక్‌తో అఫ్రిదికి ఇర్ఫాన్ సరైన గుణపాఠం చెప్పాడు. 2006లో పాక్ పర్యటనకు వెళ్లినప్పుడు జరిగిన ఆ సంఘటనను ఇర్ఫాన్ గుర్తు చేసుకున్నాడు. అఫ్రిది కాస్త పరుషంగా మాట్లాడేందుకు ప్రయత్నించాడని.. తాను కూడా తగ్గకపోవడంతో సైలెంట్ అయిపోయాడని తెలిపాడు."మేం 2006లో పాకిస్థాన్ పర్యటనకు వెళ్లాం. అప్పుడు ఇరు జట్ల ఆటగాళ్లు కరాచీ నుంచి లాహోర్‌కు ఒకే ఫ్లైట్‌లో ప్రయాణించాం. నా సీట్‌లో కూర్చొని ఉండగా అఫ్రిది వచ్చాడు. నా తలపై చేయి వేసి నిమురుతూ.. 'ఎలా ఉన్నావు బాబు?' అన్నాడు. 'నువ్వెప్పుడు నాకు తండ్రిగా మారావు?' అని ప్రశ్నించా. అతడివి పిల్ల చేష్టలు. నాకు స్నేహితుడు కూడా కాదు. ఆ తర్వాత కొన్ని అసభ్యకర పదాలు వాడాడు. నాకు కాస్త పక్కనే అతడి సీట్. మరోవైపు అబ్దుల్ రజాక్ సీట్‌లో ఉన్నాడు. అప్పుడు రజాక్‌ను 'ఇక్కడ ఏ మాంసం దొరుకుతుంది' అని అడిగా. కొన్ని రకాలను అతడు చెప్పాడు. వెంటనే ఇక్కడ కుక్క మాంసం దొరుకుతుందా? అని ప్రశ్నించా. రజాక్‌తోపాటు అటువైపుగా ఉన్న అఫ్రిది కూడా షాక్ అయ్యాడు. 'హే ఇర్ఫాన్, ఎందుకు అలా అన్నావు?' అని రజాక్ అడిగాడు. అప్పుడు నేను అన్న మాటలకు అఫ్రిది సైలెంట్ అయిపోయాడు. 'ఏం లేదు. అఫ్రిది కుక్క మాంసం తిన్నాడేమో.. చాలా సమయం నుంచి మొరుగుతూనే ఉన్నాడు' అని అనడంతో అఫ్రిది కాసేపు మారుమాట్లాడలేదు. తర్వాత ఏమన్నా సరే.. ఇదిగో అతడు అరుస్తున్నాడంటూ కామెంట్ చేసేవాడిని. ఆ సంఘటన నుంచి ఇంకెప్పుడూ నాతో మాటల యుద్ధం పెట్టుకోకూడదని అఫ్రిది భావించాడు" అని ఇర్ఫాన్ వివరించాడు.



క్లాసిక్ చీరలో రాశి ఖన్నా చంపేసింది

# డివోషనల్ బ్యాక్ డ్రాప్ లో మరో భారీ సినిమా




గత కొన్నాళ్లుగా ఇండియన్ సినిమాలో పురాణాలకు, డివోషనల్ కు సంబంధించిన కథలపై ఎక్కువ సినిమాలొస్తున్నాయి. సినిమాలు రావడమే కాదు, వాటికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ కూడా దక్కుతుంది. అందుకే పురాణాల ఆధారంగా లేదా దేవుడి కథలపై సినిమాలు తీయాలని అందరికీ ఆసక్తి ఏర్పడుతుంది. ఇప్పటికే ఈ నేపథ్యంలో పలు దేవుళ్లపై సినిమాలు రాగా, ఇప్పుడు మరో సినిమా రెడీ అవుతోంది. ఢిల్లీకి చెందిన ప్రముఖ బోధకుడు జితామిత్ర ప్రభుశ్రీ ఆశీస్సులతో ఓ భారీ సినిమా రూపొందుతుంది. శ్రీజీ ఎంటర్టైన్మెంట్స్, అభయ్ చరణ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మహాకావ్యానికి సంబంధించిన టైటిల్ ను తాజాగా మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. శ్రీ కృష్ణ అవతార్ ఇన్ మహోబా అనే టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ సినిమాను అనిల్ వ్యాస్ నిర్మిస్తున్నారు.

**పాన్ వరల్డ్ మూవీగా..**

11-12 శతాబ్దాల కాలం నాటి మహోబా వైభవాన్ని, శ్రీకృష్ణుడి ఆధ్యాత్మికతను, ధీరత్వాన్ని ఈ సినిమాలో చూపించనున్నారు. శ్రీకృష్ణుడిని ఓ యుద్ధ వీరుడిగా చూపిస్తూ వస్తోన్న మొదటి సినిమాగా ఇది చరిత్రకెక్కుతోంది. ఈ సినిమాకు ముకుంద్ పాండే దర్శకత్వం వహిస్తుండగా, దీన్ని భారీ బడ్జెట్ తో ఓ పాన్ వరల్డ్ మూవీగా తీర్చిదిద్దాలని దర్శకనిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. టైటిల్ ను అనౌన్స్ చేస్తూ మేకర్స్ ఓ చిన్న పోస్టర్ ను రిలీజ్ చేయడంతో పాటూ పలు విషయాలను వెల్లడించారు. త్వరలోనే ఈ సినిమాలో ఎవరెవరు భాగం కానున్నారు? ఏ పాత్రలో ఎవరు కనిపించనున్నారనే విషయాలు కూడా అనౌన్స్ కానున్నాయి. మరి పురాణాల కాలం నాటి నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ ప్రెస్టీజియస్ ప్రాజెక్టు ఆడియన్స్ ను ఏ మేర ఆకట్టుకుంటుందో చూడాలి.



స్కై-బ్లూలో సారా అలీ ఖాన్ లవ్లీ మూమెంట్స్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com